

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
## వైఎస్ఆర్ కడప
శుక్రవారం 15 ఆగస్టు 2025
పేజీలు - 08


# జెండా పాతారు!

## జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం




- పులివెందులలో మారెడ్డి లతారెడ్డి 6,033 ఓట్ల మెజార్టీతో గెలుపు
- డిపాజిట్ కోల్పోయిన వైసీపీ అభ్యర్థి హేమంత్‌రెడ్డి
- ఒంటిమిట్టలోను అవే ఫలితాలు..
- టీడీపీ అభ్యర్థి ముద్దుకృష్ణారెడ్డి 6,267 ఓట్ల ఆధిక్యతతో విజయం
- వైసీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి 6,513 ఓట్లు మాత్రమే పోలు
- కౌంటింగ్ ప్రక్రియను బహిష్కరించిన వైసీపీ
- పులివెందుల, ఒంటిమిట్ట గెలుపుతో టీడీపీ శ్రేణుల్లో సంబరాలు
- నా విజయానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు..: లతారెడ్డి

కడప బ్యూరో - మేజర్‌న్యూస్

రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపిన పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయింది. వైఎస్ జగన్ సొంతగడ్డగా భావించే ఈ కోటను టీడీపీ బద్దలు కొట్టింది. చారిత్రాత్మకంగా చేజిక్కించుకుంది. హెూరాహెూరీగా సాగిన పోటీలో చివరికి టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించడం విశేషం. హెూరాహెూరీగా సాగిన ఈ ఉప ఎన్నికలలో చివరికి టీడీపీ ఘన విజయాన్ని నమోదు చేసుకుంది. ఈ ఫలితాల్లో టీడీపీ అభ్యర్థి లతారెడ్డి ఘన విజయం సాధించారు. ఆమె 6,033 ఓట్ల మెజార్టీతో గెలిచారు. వైసీపీ అభ్యర్థి హేమంత్ రెడ్డి డిపాజిట్ కోల్పోయారు. వైకాపాకు 683 ఓట్లు మాత్రమే లభించాయి. కాంగ్రెస్‌కు 101 ఓట్లు వచ్చాయి. ఈ స్థానానికి టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కలిపి 11 మంది పోటీపడ్డారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో 74 శాతం ఓటింగ్ నమోదైంది. విజయం సాధించిన టీడీపీ అభ్యర్థిని మంత్రి సవిత అభినందించారు. పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ఒకరోజు ముందే పులివెందులకు స్వేచ్ఛ లభించిందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ పులివెందుల కోటను బద్దలు కొడతామన్నారు. ఈ విజయం కోసం కష్టపడ్డ కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఒంటిమిట్టలోనూ టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి 6,267 ఓట్ల మెజారిటీతో వైసీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిపై గెలుపొందారు. ఈ ఫలితాలు టీడీపీ శ్రేణుల్లో జోష్ నింపాయి. జగన్ కంచుకోట గోడలను బద్దలు కొట్టమనే ఆనందంతో టీడీపీ కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు.

మిగతా 2పేజీలో



### 30 ఏళ్ల చరిత్ర
## తిరగరాశాం!

పులివెందుల, ఒంటిమిట్ట రెండు చోట్లా టీడీపీ ఘన విజయంపై సీఎం చంద్రబాబు స్పందించారు. కడప జిల్లా టీడీపీ నేతలంతా పులివెందుల విజయం పట్ల స్పందించాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరిగాయని పేర్కొన్నారు. 30 ఏళ్ల తర్వాత చరిత్ర తిరగరాశామని ఆయన ఉద్ఘాటించారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగాయి కాబట్టి.. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలకు 11 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. అలాగే ఒంటిమిట్ట గెలుపుపైనా హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎన్నికల్లో కష్టపడి టీడీపీకి ఘన విజయాన్ని సాధించిన ప్రతి టీడీపీ నాయకుడు, కార్యకర్తకు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు.



### పులివెందులలో
## ప్రజాస్వామ్యం గెలిచింది

పులివెందుల టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి

2లో

### దొంగ ఓట్లు వేసుకున్న దాన్ని
## ఎలక్షన్ అంటారా?

కడప జిల్లా వైఎస్ అవినాష్ రెడ్డి



### ఆర్టీపీపీ వద్ద ఘోర
## రోడ్డు ప్రమాదం

- బైకును ఢీకొన్న టిప్పర్
- ఇద్దరు మహిళలు మృతి, ఒకరికి గాయాలు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పై సునీల్ కుమార్ రెడ్డి
- న్యాయం చేయాలంటూ మృతదేహాల వద్దనే ధర్నా చేపట్టిన స్థానికులు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి



ఎర్రగుంట్ల మేజర్‌న్యూస్: ఎర్రగుంట్ల మండల పరిధిలోని కలమల్ల గ్రామం పరిధిలోని ఆర్టిపిపి అతి సమీపాన ఉన్న బ్రిడ్జి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గాయత్రి (25), సుభాషిని (35)లు అక్కడికి అక్కడే

..మిగతా 2వపేజీలో

### పెద్దవంక లోలెవెల్
## కాజువేతో అవస్థలు

గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు



8లో

## ప్రజాస్వామ్యం గెలిచింది

### జగన్ ఇలాఖాలో టిడిపి జెండా రెపరెప
### జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత



2లో

# ప్రజాస్వామ్యం గెలిచింది



**కడప రూరల్, మేజర్‌న్యూస్:** వైసిపి నాయకులు జరిగిన జెడ్పిటిసి ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని, దౌర్జన్యాలు చేసి బెదిరించి ప్రలోభాలు పెట్టినప్పటికీ ప్రజాస్వామ్యమే గెలిచిందని జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. నగరంలోని హొటల్ హరిప్రియలో గురువారం నిర్వహించిన చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒంటిమిట్ట, పులివెందుల నియోజకవర్గ టిడిపి జడ్పిటిసి అభ్యర్థులు ఘనవిజయం సాధించారని, జగన్ సొంత నియోజకవర్గంలో టిడిపి జెండా రెపరెపలాడిందని, ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరిగాయని ఆమె చెప్పారు. జగన్మోహన్ రెడ్డి కుర్చీ కోసం ఏమైనా చేస్తారని, రెచ్చగొడతారన్నది ఆయన పార్టీ కార్యకర్తలు తెలుసుకున్నారన్నారు. సొంత చిన్నాన్నపై గొడ్డలి వేటు వేయించి, ఆ పాపం చంద్రబాబుకు రుద్ది గెలవాలనుకున్న వ్యక్తి జగన్ అని తీవ్రస్థాయిలో ఆమె విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి చూసి ప్రజలు టిడిపి జెడ్పిటిసి అభ్యర్థులను గెలిపించారని అన్నారు.ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ వైసిపి నాయకుల అరాచకాలను జడ్పిటిసి ఎన్నికల్లో ప్రచారం చేశామని, జరిగిన ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులకు డిపాజిట్ కూడా దక్కలేదన్నారు. రాష్ట్రానికి రాబోవు రోజులు మంచి రోజులని, పోలవరం పూర్తి అవుతుందని, మోడీ పాలనలో అన్ని విధాల రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందన్నారు. టిడిపి అభ్యర్థుల గెలుపు ప్రజా విజయంగా అభివర్ణించారు. కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ పులివెందుల ప్రజలు జగన్కు బాగా బుద్ధి చెప్పారని అయినా జగన్‌కు బుద్ధి రాలేదని అన్నారు. ఎంత అణగదొక్కి గెలవాలనుకున్నప్పటికీ ప్రజలు ఓటమి రుచి చూపించి, టిడిపికి పట్టం కట్టారని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ళ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందని, 30 ఏళ్లుగా వారే ఓట్లు గుద్దుకొని అధికారం చలాయించారని అన్నారు. జగన్ పై వైసీపీ కార్యకర్తలే వ్యతిరేకతతో అన్ని విధాల గెలుపుకు సహకరించారని చెప్పారు. ప్రజాస్వామ్యం గూర్చి జగన్ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. పులి వెందుల జడ్పిటిసి ఎన్నికల్లో రఫ్ఫా రఫ్ఫా బ్యాచ్ ఏమైంది అని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, పులి వెందుల జడ్పిటిసి లతారెడ్డి, బాలిశెట్టి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో తైక్వాండో పోటీలో ప్రతిభ చాటిన పోరుమామిళ్ల వారియర్స్ అకాడమీ క్రీడాకారులు

పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ : జాతీయ స్థాయి ఓపెన్ తైక్వాండో ఛాంపియన్షిప్ లో పతకాలు సాధించారు. తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (టి ఎఫ్ ఐ) ఆధ్వర్యంలో 10 వ జాతీయస్థాయి ఓపెన్ తైక్వాండో పోటీలు ఈనెల 25 నుంచి 27 వరకు విజయవాడలో చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియం నిర్వహించారు. ఈ పోటీల్లో వారియర్స్ తైక్వాండో అకాడమీ క్రీడాకారులు 1ఫర్ మాన్2. నాగ దీపిక 3. హరిచరణ్ 4. గురు జస్వంత్ 5. ఆయిల్ 6. జతిన్ రెడ్డి లు బంగారు పతకాలు సాధించారు. 1. వైష్ణవి 2. షరీఫ్ రజత పతకాలు సాధించారు. వీరిని వారియర్స్ అకాడమి కోచ్ సుభాష్ రఫీ లు అభినందించారు.

# జెండాపాతారు!

**కడప బ్యూరో - మేజర్‌న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో వైసీపీకి ఘోర పరాభవం ఎదురైంది. టీడీపీ - వైసీపీ మధ్య అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించారు. కడప నగర సమీపంలోని మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ఉదయం 8 గంటలకు బ్యాలెట్ పేపర్ల కౌంటింగ్ నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలలోపే ఈ ఫలితాలు వెలుపడ్డాయి. ఈ రెండు స్థానాలను అధికార టీడీపీ కైవసం చేసుకుంది. వైసీపీ దారుణమైన పరాభవాన్ని కూడగట్టుకుంది. పులివెందుల జడ్పీటీసీ పరిధిలో 10,601 ఓట్లు ఉండగా అందులో మంగళ, బుధవారాల్లో జరిగిన పోలింగ్‌లో 7,794 ఓట్లు పోలయ్యాయి. అధికార టీడీపీ - వైసీపీ మధ్యనే గట్టి పోటీ ఉంటుందని అందరూ భావించారు. అయితే ఫలితాలను బట్టి చూస్తే పోలింగ్ ఏకపక్షంగా సాగిందని చెప్పవచ్చు. టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతా రెడ్డి 6,716 ఓట్లు సాధించగా వైసీపీ అభ్యర్థి తుమ్మల హేమంత్ రెడ్డికి 683 ఓట్లు పోలయ్యాయి. దీంతో టీడీపీ అభ్యర్థి లతా రెడ్డి 6,033 ఓట్ల మెజారిటీతో వైసీపీ అభ్యర్థి పై గెలుపొందారు. దీంతో వైసీపీ అభ్యర్థితోపాటు పోటీ చేసిన అభ్యర్థులందరూ డిపాజిట్ కోల్పోయినట్లు అయింది. కాంగ్రెస్ అభ్యర్థి 101 ఓట్లు సాధించారు. ఈ ఎన్నికల్లో పులివెందుల జడ్పీటీసీ స్థానం నుంచి 11 మంది పోటీ చేసిన విషయం తెలిసిందే. కౌంటింగ్ కోసం అధికారులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. పది టేబుళ్ళను ఏర్పాటుచేసి ఒకే రౌండ్ లో పులివెందుల ఫలితం వెలువడేలా ఏర్పాట్లు చేశారు. ఒక్కో టేబుల్ కు వెయ్యి బ్యాలెట్లు కేటాయించారు. అయితే 8 వేల లోపే ఓట్లు పోల్ కావడంతో 8 టేబుళ్ళలో కౌంటింగ్ పూర్తి చేశారు. దీంతో కౌంటింగ్ ప్రారంభం అయిన మూడు గంటలలోనే పూర్తి ఫలితం వెలువడింది. మొత్తం పులివెందులలో 7,794 ఓట్లు పోల్ కాగా, అందులో 7,638 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. 145 ఓట్లను అధికారులు తిరస్కరించారు. 11 ఓట్లు నోటాకు వేశారు.

### ఒంటిమిట్టలోనూ టీడీపీ అభ్యర్థి గెలుపు

ఇక, ఒంటిమిట్ట జడ్పీటీసీ విషయానికి వస్తే టీడీపీ అభ్యర్థి అడ్డలూరు ముద్దు కృష్ణారెడ్డి 6,267 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. వైసీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి మొత్తం 6,513 ఓట్లు మాత్రమే సాధించారు. కౌంటింగ్ జరిగిన మూడు రౌండ్లలో టీడీపీ అభ్యర్థి ఆధిక్యత సాధిస్తూ వచ్చారు. ఒంటిమిట్ట పరిధిలో 24 వేల ఓట్లు ఉండగా 20,467 ఓట్లు పోలయ్యాయి. పది టేబుళ్ళపై మూడు



రౌండ్లలో కౌంటింగ్ జరిగింది. ఇందులో టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణ రెడ్డి మొత్తం 12,780 ఓట్లు సాధించారు. వైసీపీ అభ్యర్థి సుబ్బారెడ్డి 6,513 ఓట్లు సాధించారు. దీంతో ముద్దు కృష్ణరెడ్డి 6,267 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి పూల విజయ భాస్కర్ రెడ్డి తోపాటు స్వతంత్ర అభ్యర్థులు అందరూ డిపాజిట్ కోల్పోయారు. ఒంటిమిట్ట ఫలితంతో వైసీపీ భారీషాక్ కు గురైంది. ఈ జడ్పీటీసీ స్థానం పరిధిలో మొత్తం 20,467 ఓట్లు పోల్ కాగా అందులో 19,836 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. 602 ఓట్లను అధికారులు తిరస్కరించారు. 29 ఓట్లు నోటాకు పోలయ్యాయి.

### కౌంటింగ్ ను బహిష్కరించిన వైసీపీ

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల కౌంటింగ్‌ను వైసీపీ బహిష్కరించింది. పార్టీ అధినేత జగన్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ శ్రేణులు తెలిపారు. దీంతో కౌంటింగ్ పరిసరాల్లో వైసీపీ నేతలెవరు కనిపించలేదు. పులివెందుల జడ్పీటీసీ పరిధిలోని 15 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని ఆపార్టీ అధినేత వైయస్.జగన్ కోరిన విషయం తెలిసిందే. అయితే రాష్ట్ర ఎన్నికల కమీషన్ కేవలం రెండు పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే పోలింగ్ నిర్వహించింది. దీనికి నిరసనగా వైసీపీ కౌంటింగ్‌ను బహిష్కరించింది.

### అందరికీ ధన్యవాదాలు..: మారెడ్డి లతారెడ్డి

దీంతో పులివెందుల జడ్పీటీసీగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి మారెడ్డి లతారెడ్డి అధికారిక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పులివెందుల జడ్పీటీసీగా గెలుపొందడం చాలా సంతోషాన్ని కలిగిస్తోంది. నా గెలుపులో పాలుపంచుకున్న టిడిపి, జనసేనా, బిజెపి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు. నాకు కొండంత ధైర్యంగా ఉండి నా గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన కూటమి నాయకులకు,
కార్యకర్తలకు నా ధన్యవాదాలు అంటూ చెప్పారు.

# దొంగ ఓట్లు వేసుకున్న దాన్ని ఎలక్షన్ అంటారా?

## నిజంగా ఇది ఒక అనైతిక ఎన్నిక - గెలిచామని మీరు తప్ప ప్రజలు అనుకునే అవకాశమే లేదు.

## కడప జిల్లా వైఎస్ అవినాష్ రెడ్డి

**పులివెందుల, మేజర్‌న్యూస్:** గత రెండు రోజుల కిందట జరిగినటువంటి జడ్పిటిసి ఎన్నిక నిజంగా ఇది ఒక అనైతిక ఎన్నిక అని, కూటమి నాయకులు గెలిచామని మీరు తప్ప ప్రజలు అనుకునే అవకాశమే లేదని ఎంపీ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్లోమీడియా రాతలు ప్రజలను ఏదో నమ్మించాలని ప్రయత్నం చేస్తున్నారు. ఉత్కంఠకు తెర అని ఓ పత్రిక రాస్తే..లోకేశ్ అయితే ప్రజాస్వామ్యం నిలబడింది అంటున్నాడు, ఎవర్ని నమ్మించడానికి ఇలాంటి రాతలు, స్టేట్ మెంట్లు ఇస్తున్నారు..? అసలు పులివెందుల జడ్పీటీసీ స్థానంలో ఓటింగ్ జరిగి ఉంటే కదా మీరు ఇలాంటి రాతలు రాయాల్సింది..? వేసుకుందే దొంగ ఓట్లు..దానికి ఉత్కంఠ అంటారు..నువ్వా నేనా అంటూ ఎందుకు రాతలు, దానికి మళ్లీ ప్రజాస్వామ్యం నిలబడింది అంటూ స్టేట్ మెంట్లు, ఇక్కడ జరిగింది పులివెందుల, కడప జిల్లా వాళ్లకు మాత్రమే తెలుసు..రాష్ట్రమంతా తెలియదు కాబట్టి ఎల్లో మీడియాలో ఇక్కడ అంతా సవ్యంగా జరిగినట్లు వార్తలు రాయించేసుకుంటున్నారు. ఇక్కడ నిజంగానే ఏదో ఓటింగ్ జరిగింది.దాంట్లో మేం గెలిచాం అని రాష్ట్ర ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. దొంగ ఓటింగ్ జరిగిందని అందరికీ అర్థమైంది. ఇలాంటి రాతలు అనైతికం కాదా? మీ పత్రిక, చానల్ ఎంత అనైతికంగా ఇలాంటి వార్తలు రాస్తుందో మీరే ఒక సారి ఆత్మవిమర్శ చేసుకోండి, నిజమైన పోటీ జరిగి ఐదు ఓట్లతోనైనా టీడీపీ గెలిస్తే వారికి ఎనలేని తృప్తి ఉండేది మాకు బాధ ఉండేది, కానీ ఈ విధంగా పోలీసుల సంపూర్ణ సహకారంతో వేలాది మంది టీడీపీ కార్యకర్తలను బూత్ ల ఎదురుగా పెట్టి నిజమైన ఓటరు స్లిప్పులు లాక్కున్నారు. నిజమైన ఓటరును అసలు పోలింగ్ బూత్ లోకే పోనివ్వలేదు, దీన్ని ఎలక్షన్ అంటారా...? ఇంకేమైనా అంటారా..? మీరు గెలిచామని మీరు అనుకోవాల్సిందే తప్ప ప్రజలు అనుకునే అవకాశమే లేదు. ప్రజలు ఓట్లు వేసి ఉంటే కదా మీరు గెలిచాం అని చెప్పుకోడానికి..? మీ దొంగ ఓటర్లు కూడా మీరు గెలిచారు అని అనుకోరు.ఎందుకంటే జరిగిందతా వారికి తెలుసు కాబట్టి. వారితో ఓట్లు వేయించలేదు కాబట్టి పులివెందుల మండల ఓటర్లు మీరు గెలిచారని అసలే అనుకోరు, ప్రతిపక్ష పార్టీ ఏజెంట్లను, ఓటర్లను బూత్ లోకి రానివ్వకుండా చేసుకున్న పోలింగ్ ను ఎలక్షన్ అంటారా..? దీన్ని ఎన్నిక అంటారో లేదో మీ విజ్ఞతకే వదిలేస్తున్నా..నిజంగా ఇది ఒక అనైతిక ఎన్నిక. వైఎస్సార్సీపీ కార్యకర్తలు ఎవ్వరూ నిరుత్సాహపడాల్సిన అవసరం లేదు. వీరికి గుణపాఠం చెప్పే రోజువస్తుంది.అప్పుడు ఇలా దొంగ ఓట్లతో కాదు మనం ఎప్పుడు చేసే విధంగా నిజమైన ఓటింగ్ తోనే వీళ్లకు గుణపాఠం చెబుదాం. అని పేర్కొన్నారు.

# ఆర్టీపీపీ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

దుర్మరణం చెందగా, వెంకటేష్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలైనవి. ఈ విషయం తెలుసుకున్న వెంటనే కలమల్ల ఎస్సై సునీల్ కుమార్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తీవ్ర గాయాలు పాలైన వెంకటేశ్ ను ఎస్సై సునీల్ కుమార్ రెడ్డి తన జీపులో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. స్థానికులు పోలీసులు తెలిపిన సమాచారం మేరకు ముద్దనూరు మండలం కొసినేపల్లె గ్రామానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తి ఆర్టీపీపీ లో లోకో షెడ్డులో పనిచేస్తూ ఉన్నాడు. గురువారం తమ బంధువులు వివాహం ప్రొద్దుటూరులో జరగనుంది. ఆ వివాహానికి వెళ్లడానికి వెంకటరమణ తమ్ముడు వెంకటేస్ బైకులో తన భార్య గాయత్రి, వదిన సుభాషిణి తో కలిసి ముగ్గురు బైక్ లో బయలుదేరారు. కలమల్ల గ్రామ సమీపంలోని బ్రిడ్జి మీద పోతుండగా ఆర్టీపీపీ నుంచి అధిక లోడుతో వస్తున్న ప్లైయాష్ టిప్పర్ కలమల్ల బ్రిడ్జి వద్దకు రాగానే బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ లో పోతున్న సుభాషిణి, గాయత్రి మహిళలు కింద పడ్డారు. ఆ వెంటనే టిప్పరు వారి పైకి దూసుకు వెళ్ళింది. గాయత్రి , సుభాషిని అక్కడికక్కడే మృతి చెందారు. గాయాల పాలైన వెంకటేష్ ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన తెలుసుకున్న వెంటనే మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని ఎస్ఐ సునీల్ కుమార్ రెడ్డి తెలియజేశారు



### న్యాయం చేయాలంటూ ధర్నా

ప్రమాదంలో మృతి చెందిన గాయత్రి సుభాషిని కుటుంబాలకు న్యాయం చేయాలంటూ స్థానికులు పెద్ద ఎత్తున బ్రిడ్జి వద్దనే మృతదేహాలు తో ధర్నా చేపట్టారు ఆర్టీపీపీ నుంచి పెద్ద ఎత్తున అధికలోడుతో టిప్పర్లు ఇలా మనుషులను తొక్కుకుంటూ పోతున్నాయని ఎవరు పట్టించుకోలేదని వాపోయారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయకపోతే ఆందోళన తీవ్రత చేస్తామని హెచ్చరించారు. అధికలోడు నియంత్రణ చేయాలనే అటు ఆర్టీపీపీ అధికారులు కూడా ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని వాపోయారు.

## ఎర్రగుంట్ల ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మికంగా తనిఖీ

### జోనల్ మలేరియా అధికారి డాక్టర్ జమాల్ భాషా



**ఎర్రగుంట్ల, మేజర్‌న్యూస్:** ఎర్రగుంట్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ జమాల్ బాషా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు తనిఖీ చేసి ఏవైనా సమస్య ఉంటే తమకు తెలియజేయాలని అన్నారు. పీహెచ్సీలో ల్యాబ్ ఫార్మసీ వార్డులను పరిశీలించారు. మలేరియా పాజిటివ్ కేసులు ఏమైనా వస్తున్నాయా అడిగి తెలుసుకున్నారు. అన్ని మందులు అందుబాటులో ఉన్నాయా లేవా అని ప్రశ్నించారు. ఒకవేళ ఏదైనా అవసరమైతే తనని సంప్రదించాలని అన్నారు. ఈ సందర్భంగా వర్షాకాలం ప్రారంభం అయినందువలన జ్వరాలు అధికంగా వస్తున్నాయి కాబట్టి ఎటువంటి మలేరియా గాని ఇక ఏదైనా గాని సమస్యలు రాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆరోగ్య విస్తరణాధికారి నిత్య పూజయ్య, హెల్త్ అసిస్టెంట్ ఓబులేసు ల్యాబ్ టెక్నీషియన్ హుస్సేన్ తదితరులు వచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జోత్స్న సూపర్వైజర్ ఓబులేసు ఎంపీహెచ్వో రవిశంకర్ రాజు ఫార్మసిస్ట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు అన్నదానం



**కడప, మేజర్‌న్యూస్ :** కడప నగరానికి చెందిన రిటైర్డ్ జేఏవో ఏపీ ఏస్‌పిడిసిఎల్ కంచర్ల సోమశేఖర్ రెడ్డి సతీమణి కీర్తిశేషురాలు కంచర్ల రాజేశ్వరి మూడవ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు కంచర్ల శివప్రసాద్ రెడ్డి కంచర్ల మహేంద్ర నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కడప నగరంలోని సబ్ జైల్ దగ్గర గల శ్రీ చౌడమ్మ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కుమారుడు కంచర్ల మహేంద్ర నాథ్ రెడ్డి మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చడం భగవంతుడు నాకు కల్పించిన మహాభాగ్యమని మహేంద్ర నాథ్ రెడ్డి అన్నారు. భవిష్యత్తులో కూడా తన తల్లి పేరు మీద అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎం.వి కృష్ణారెడ్డి ,దేవరకొండ సుబ్బరాయుడు, శివశంకర్ హరినాథ్ రెడ్డి, శ్రీ చౌడమ్మ వృద్ధాశ్రమ నిర్వాకులు ఇస్మాయిల్, కంచర్ల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎద్దుల బండిని బైక్ ఢీ కొనడంతో వ్యక్తి మృతి



**బ్రహ్మంగారిమఠం, మేజర్‌న్యూస్:** బ్రహ్మంగారిమఠం మండలంలోని నరసనపల్లి గ్రామానికి చెందిన దేవరకొండ నరసయ్య యాదవ్ (42)ఎద్దుల బండిని ఢీ కొనడంతో గురువారం మృతి చెందాడు.అదే గ్రామానికి చెందిన సోమిరెడ్డిపల్లి నరసయ్య వ్యవసాయ పని నిమిత్తం ఎద్దుల బండి తో పొలం దగ్గరికి వెళుతున్న సమయంలో,దేవరకొండ నరసయ్య యాదవ్ బైకుతో వెనక నుండి వేగంగా వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది.దీంతో నరసయ్య వెంటనే కుప్పకూలి పడిపోవడంతో అక్కడున్న వారు 108కు ద్వారా పొద్దుటూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు సమాచారం.పూర్తి విషయాలు తెలియాల్సి ఉంది.

# పోలీస్ శాఖలో అత్యుత్తమ పనితీరుకు సేవా పతకాలు

### అభినందించిన జిల్లా ఎస్.పి అశోక్ కుమార్





**కడప క్రైమ్, మేజర్‌న్యూస్ :** కడప జిల్లాలో వివిధ ప్రాంతాలలో పోలీస్ శాఖలో పనిచేస్తూ అత్యుత్తమ పనితీరు కనబరచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి గుర్తింపుగా ఇచ్చే ప్రతిష్టాత్మక సేవా పతకాలను రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రకటించింది. అందులో కడప జిల్లాకు చెందిన 8 మంది పోలీస్ సిబ్బంది పతకాలకు ఎంపికయ్యారు. వీరు పోలీస్ శాఖలో గతంలో తన ప్రతిభను కనబరుస్తూ అనేక కేసులను ఛేదించి జిల్లా ఉన్నతాధికారుల నుంచి ప్రశంసా పత్రాలు రివార్డులు అందుకోవడం జరిగింది, ఎంపికైన వారిని జిల్లా ఎస్.పి అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

**సేవా పతకాలకు ఎంపికైన వారి వివరాలు:**
ఏ.ఎస్.ఐ, సి.శివశంకరయ్య, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, బద్వేలు రూరల్ ఎం.నాగభూషణం, ఏ.ఎస్.ఐ, కలసపాడు, ఎన్.మురళి యాదవ్, ఏ.ఎస్.ఐ, చక్రాయపేట డి.శేషశయన రావు, హెడ్ కానిస్టేబుల్, ఎ.వెంకట రమణయ్య, ఏ.ఆర్.హెచ్.సి 917, ఎం.వెంకట రత్నం, ఎం.సునీల్, పి.సి 344, చాపాడు పి.ఎస్, ఎస్.గురువయ్య, ఎ.ఆర్.హెచ్.సి 562లకు.ఏ.పి స్టేట్ పోలీస్ సేవా పతకం ఈ పథకాలను స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా అధికారుల నుండి అందుకోనున్నారు,

# బద్వేల్‌ను కడప జిల్లాలోనే కొనసాగించాలి

### మాజీ ఆప్కాస్ స్టేట్ బోర్డు మెంబర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి



**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ :** కొత్త జిల్లాల ప్రతిపాదన తీసుకువచ్చి 26 జిల్లాలుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని, 32 జిల్లాలుగా ప్రతిపాదించి అందులో బద్వేల్ నియోజకవర్గాన్ని రాజంపేట జిల్లా ప్రతిపాదన జాబితాలో కనబరుస్తున్నారు. ఈ విషయంపై పునరాలోచన చేసి బద్వేల్ నియోజకవర్గాన్ని వైయస్సార్ కడప జిల్లాలోనే సాగించాలని మాజీ ఆప్కాస్ స్టేట్ బోర్డు మెంబర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. గురువారం గత ప్రభుత్వం 13 జిల్లాలు గా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 26 జిల్లాలు గా పునర్వ్యవస్థీకరణ చేసిందని గుర్తు చేశారు. జిల్లా కేంద్రానికి కొన్ని మండలాలు సుదూరంగా ఉన్నాయని చెబుతున్న కూటమి ప్రభుత్వం బద్వేల్ నియోజకవర్గ విషయంలో అదే తప్పును చేస్తుంది. ఇప్పుడు ప్రతిపాదిత జిల్లాలుగా చూపుతున్న ప్రాంతాలలో బద్వేల్ నియోజకవర్గం రాజంపేట జిల్లా కేంద్రానికి చాలా దూరంగా ఉందని ఈ నియోజకవర్గంలోని పోరుమామిళ్ల, కలసపాడు, బి కోడూరు మండలాలు జిల్లా కేంద్రానికి 120 కిలోమీటర్ల పైగా దూరాన్ని కలిగి ఉన్నాయని అదే కడప జిల్లా కేంద్రానికి అయితే కేవలం 80 కిలోమీటర్లు మాత్రమే ఉన్నదని, ఈ అంశాల్ని పరిగణించి ప్రజల అవసరాల దృష్ట్యా కూటమి ప్రభుత్వం చేసిన ఈ ప్రతిపాదనను విరమించుకొని, కడప జిల్లాలోనే బద్వేల్ నియోజకవర్గాన్ని కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. లేదంటే బద్వేల్ నియోజకవర్గాన్ని కడప జిల్లాలోనే కొనసాగించేంతవరకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

## సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమయ్యే వ్యక్తుల పట్ల జాగ్రత్త వహించండి

### పట్టణ ఇన్స్పెక్టర్ కె. రమణారెడ్డి,



**మైదుకూరు మేజర్‌న్యూస్ :** సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమయే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని మైదుకూరు పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.రమణారెడ్డి తెలిపారు. మైదుకూరు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల నందు గురువారం కళాశాల విద్యార్థినిలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయేమో తెలుసుకొన్నారు. అలాగే సోషల్ మీడియా ద్వారా పరిచయమయ్యే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని అలాంటి పరిచయాలు కేవలం తాత్కాలికమని తెలిపారు.అలాగే వరుస సెలవు దినాల( స్వాతంత్ర దినోత్సవం, కృష్ణాష్టమి, ఆదివారం) కారణంగా దొంగతనాలు జరగకుండా నివారించేందుకు ప్రతి ఒక్కరూ కూడా ఏవైనా ఊర్లకు వెళుతున్నప్పుడు పోలీసులకు ముందుగా సమాచారం అందించాలని, విలువైన వస్తువులను ఇంటి యందు ఉంచు కోకూడదని, మోటార్ సైకిళ్లకు సైడ్ లాక్ వేసుకోవాలని, పై విషయాలలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎలాంటి దొంగతనాలు జరగకుండా చూడాలని పట్టణ మరియు గ్రామాల ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## కౌంటింగ్ కేంద్రం వద్ద అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో నిఘా



**కడప క్రైమ్, మేజర్‌న్యూస్:** పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పిటిసి ఉప ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గురువారం కడప నగరం లోని మౌలానా ఆజాద్ ఉర్దూ పాలిటెక్నిక్ కళాశాల కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా ఎస్.పి ఇ.జి అశోక్ కుమార్ కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి బందోబస్తును పర్యవేక్షించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద, పరిసర ప్రాంతాలలో అత్యాధునిక డి.జె.ఐ మాట్రిక్స్ డ్రోన్ కెమెరాతో పాటు సి.సి కెమెరాలతో నిఘా ఉంచారు. జిల్లా ఎస్.పి స్వయంగా డ్రోన్ ఎగురవేసి కవరేజ్ ఏరియాను విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు. అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి ఎన్.సుధాకర్, ఏ.ఆర్ డి.ఎస్.పి శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ దారెడ్డి భాస్కర్ రెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## ఉచిత సీట్లకు గడువు పొడిగింపు

### ఈనెల 20 వరకు ఆన్ లైన్ లో దరఖాస్తులు

### మండల విద్యాశాఖ అధికారులు..

**వల్లూరు,మేజర్‌న్యూస్ :** విద్య హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు ఆన్ ఎయిడెడ్ పాఠశాలలో ఉచిత విద్యకు గడువు పొడిగించినట్లు వల్లూరు మండల విద్యాశాఖ అధికారి-1 నాగరత్న ఎంఈఓ-2 విజయ రెడ్డి తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లల కోసం ప్రైవేటుఆన్ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత విద్యను అమలు చేస్తుందన్నారు ఐదేళ్లు నిండిన పిల్లలు ఒకటో తరగతి ప్రవేశానికి అర్హులన్నారు ఈనెల 20 తేది వరకు ఆన్ లైన్లో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు గ్రామాలకు ఐదు కిమీ దూరంలో ఉన్న ప్రైవేటుఆన్ ఎయిడెడ్ పాఠశాలలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు అందించేందుకు మరో మారు అవకాశం కల్పించడం జరిగిందన్నారు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఓబీసీ ఓసి వర్గాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు ఈ అవకాశం కల్పించారన్నారు జనన ఆదాయ నివాస కుల ధ్రువీకరణ పత్రం తో పాటు ఆధార్ కార్డు రెండు పాస్ పోర్టు సైజు ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు

# బీహార్ తరహాలో పులివెందుల జడ్పీటీసీ ఎన్నికలు

## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి రవీంద్రనాథ్ రెడ్డి




**కడప ప్రతినిధి – మేజర్‌న్యూస్** రాష్ట్రంలో ఎన్నో జడ్పీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నా ఎంపిక చేసుకుని కొన్ని స్థానాలకే ఎన్నికలు జరిపారు. బీహార్ రాష్ట్ర తరహాలో పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నిక జరిగిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి రవీంద్రనాథ్ రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆయుధాలను చూపి ప్రజలను బెదిరించి ఎన్నికల్లో రిగ్గింగ్ కు పాల్పడ్డారు. ఎన్నికల్లో కలెక్టర్ సమక్షంలోనే దొంగ ఓట్లు వేశారు. అదే ఫోటోను నారా లోకేష్ ప్రజాస్వామ్యం గెలిచిందని ట్వీట్ చేసారు. అక్కడే అర్థం అయింది ఎంత దారుణంగా ప్రజాస్వామ్యం ఖూనీ చేశారో. ప్రజలను ఓటు వేసేందుకు వస్తుంటే బయటకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారని రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఎన్నికలను రద్దు చేసి కేంద్ర బలగాలతో తిరిగి నిర్వహించాలి. టీడీపీ నేతలు సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటు. ప్రజలను మభ్య పెడుతూ అప్రజాస్వామికంగా ఎన్నికలు జరిపి సంబరాలా?.. అంటూ ఆయన ప్రశ్నించారు.

# లక్ష్మీపేట జడ్పిహెచ్ హైస్కూల్లో 79వ ముందస్తు స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**చాపాడు మేజర్‌న్యూస్ :** స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని లక్ష్మీపేట జడ్పీ హైస్కూల్లో గురువారం ముందస్తు 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో పాఠశాలలో ప్రథమ స్థానంలో మార్కులు వచ్చిన వీర మమత అనే విద్యార్థినికి ఉత్తమ విశ్రాంత ఉపాధ్యాయుడు మరియు ఇంతకు మునుపు సోషియల్ టీచర్లుగా పని చేసిన చిత్రాల శ్రీనివాసులు మరియు విజయ చేతుల మీదుగా నగదు బహుమతులు, మేమెంటో అందించారు. స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ సమైక్యత అనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 లు రవిశంకర్, ఎంఈవో -2 వంశీకృష్ణ, ఏపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

# తప్పేట ఓబాయిపల్లి దళితవాడలో గోపూజ, రాక్షభంధన్ కార్యక్రమం



**చాపాడు, మేజర్‌న్యూస్ :** చాపాడు మండలం తప్పెట ఓబాయపల్లి పల్లి దళితవాడలో గురువారం శ్రీ రామాలయం నందు సమరత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతము, గోపూజ, రక్షాబంధన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ గోపూజా వ్రతాన్ని వెంకటేష్ పూజారి నిర్వహించినారు, సుబ్రహ్మణ్యం రమణ చాపాడు ప్రచారక్ తప్పెట ఓబాయిపల్లి గ్రామ కన్వీనర్ సుబ్బరాయుడు పాల్గొని ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా జరిపారు. అలాగే సాయంత్రం చాపాడు మండలం చాపాడు గ్రామంలోని శ్రీ ఆత్మారామస్వామి దేవస్థానం నందు భాగవతపఠనము, రక్షాబంధన్ కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రచారక్ రమణ, కన్వీనర్ సుబ్బరాయుడు, పూజారి అమర్నాథ్ స్వామి ఆధ్వర్యంలో దిగ్విజయంగా నిర్వహించినారు.


# పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచింది

## ముస్లిం టిడిపి నాయకుడు ఖాదర్ బాషా




**కమలాపురం, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఇచ్చిన ధైర్యంతో పులివెందులలో స్వచ్ఛందంగా ఓటు వేసుకున్న ప్రజలని జిల్లా ముస్లిం మైనారిటీ టిడిపి అధ్యక్షులు షేక్ ఖాదర్ బాషా అన్నారు, పులివెందుల ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నికలలో కూటమి అభ్యర్థిలు భారీ మెజార్టీతో గెలవడంతో కమలాపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్న టిడిపి నాయకులు, ఈ సందర్భంగా ఖాదర్ బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన ధైర్యంతో పులివెందులలో ప్రతి ఓటరు ఓటును స్వచ్ఛందంగా ఏసుకునే రోజు చూసామని ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేయడంతో వైయస్ కుటుంబానికి ఎదురు దెబ్బ తగిలి కూటమి అభ్యర్థి ఘనంగా విజయం సాధించారన్నారు, తెలుగుదేశం పార్టీ తరపున మారెడ్డి లతా కు ఓటేసి 6,735 ఓట్ల భారీ మెజార్టీతో గెలిపించి పసుపు జెండా ఎగరేశాల చేశారన్నారు, కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందిస్తున్న సంక్షేమం వారి గెలుపుకు సాధ్యమన్నారు, ఈ కార్యక్రమంలో యువరాపురం సొసైటీ చైర్మన్ వాసుదేవ రెడ్డి, పల్లె రామసుబ్బారెడ్డి, గుజ్జుల నారాయణ యాదవ్, శంకర్ యాదవ్, ప్రతాపరెడ్డి, విబరాపురం ఈశ్వర్ రెడ్డి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# బ్రహ్మంగారిమఠం దగ్గరనో పార్కింగ్ బారికేడ్లు ఏర్పాటు




**బ్రహ్మంగారిమఠం మేజర్‌న్యూస్ :** శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి దేవస్థానం దక్షిణ గాలి గోపురం ముందు వాహనాలు ఇక్కడ నిలపవద్దు అని నో పార్కింగ్ భారీకేడ్లు ను ఏర్పాటు చేశారు. స్థానికంగా ఉన్న వారు కానీ, భక్తులు కానీ ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు ప్రధాన బజార్ లోకి వెళ్లకుండా ఈ భారీకేడ్లు ఏర్పాటు చేశారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా బ్రహ్మంగారిమఠం లో భక్తుల సౌకర్యం కోసం దేవస్థాన ఫిట్ పర్సన్ శంకర్ బాలాజి, మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి ఈ ఏర్పాట్లు చేయడంపై స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బాధ్యతలు స్వీకరించిన కల్లూరు వెంకట కృష్ణారెడ్డి



**పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గా కల్లూరు వెంకటకృష్ణారెడ్డి , సభ్యులుగా కాకా సుబ్రహ్మణ్యం, అక్కి దాసరి వెంకటరమణ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సీఈవో రాళ్లపల్లి నరేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రాడ్యూటీ పెంచినందుకు కేక్ కట్ ధన్యవాదములు తెలిపిన ఆశా కార్మికులు



**మైదుకూరు, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ఆశా కార్మికులకు గ్రాడ్యుటి 1లక్ష 50 వేల రూపాయలు,ప్రసూతి సెలవులు 180 రోజులు, ఆశా కార్మికుల సర్వీస్ 62 సంవత్సరాలకు పెంచి నందుకు ఏ ఐ టి యు సి రాష్ట్ర నాయకత్వానికి, ఆశ యూనియన్ నాయకత్వానికి మరియు జిల్లా నాయకత్వానికి ఈ ఉద్యమ విజయం లో పాల్గొన్న ఆశా కార్మికులకు అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ గురువారం ఆశా యూనియన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ ఉద్యమ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి శ్రీరాములు, ఆశా వర్కర్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పివి రమణమ్మ, స్థానిక నాయకురాలు ఎస్ సావిత్రి, ఎస్. మున్వర్, గ్రేస్ రుతమ్మ,నసీమూన్, వి. విజయలక్ష్మి, విజయలక్ష్మి, పద్మ, అనురాధ, ముంతాజ్, సిపిఐ నియోజకవర్గా సహాయ కార్యదర్శి ఎస్ షావలి, సిపిఐ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు బి. పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# వర్మీ కంపోస్ట్ ఉత్పత్తి కేంద్రం పర్యటన




పులివెందుల, మేజర్‌న్యూస్ : ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల జంతు శాస్త్రం విభాగపు విద్యార్థినిలు వర్మీ కంపోస్ట్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. క్షేత్ర పర్యటన వలన విద్యార్థినులు ప్రత్యక్షంగా విజ్ఞానాన్ని నేర్చుకోగలరు. కృషి విజ్ఞాన క్షేత్ర అధినేత పాలెం చంద్ర వర్మి కంపోస్ట్ తయారీని సోదాహరణంగా వివరించారు. పేడ మరియు పంట అవశేషాలను బెడ్ లాగా చేసి అందులో వానపాములను వేసి వర్మీ కంపోస్ట్ ను తయారు చేయవచ్చని, తయారీలో పాటించవలసిన పద్ధతులను తెలియచేశారు. వర్మీ కంపోస్ట్ మొక్కలకు పోషకాలను అందజేసి మొక్కల పెరుగుదలను ప్రోత్సహించడమే కాక నేల నిర్మాణాన్ని మెరుగుపరచి సమృద్ధిగా నేలలో సూక్ష్మజీవులు నివసించడానికి అనుకూలంగా ఉంటుందని, నీటిని నిలుపుకునే సామర్థ్యం నేలకు పెరుగుతుందని తెలియజేశారు. విద్యార్థినులు కూడా భవిష్యత్తులో స్వయం ఉపాధి పద్ధతులను పాటించి అనేకులకు ఉద్యోగ అవకాశాలను కల్పించవచ్చని,దేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడవచ్చు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా. బి. శ్రీనివాసులు వైస్ ప్రిన్సిపల్ డా. సి. బాలనారాయణ జువాలజీ డిపార్ట్మెంట్ హెచ్ వో డి డాక్టర్ యు. శ్రీనిత, జనార్ధన, బి. ప్రవళిక ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అధికారిక పత్రాన్ని అందుకున్న మారెడ్డి లతా రెడ్డి



**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల జడ్పీటిసిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ద్వారా అధికారిక పత్రాన్ని మా రెడ్డి లతా రెడ్డి అందుకున్నారు. గత రెండు రోజుల కిందట జరిగినటువంటి జడ్పిటిసి ఎన్నికలలో మెజారిటీతో గెలుపొందిన మారెడ్డి లతా రెడ్డి మాట్లాడుతూ పులివెందుల జడ్పీటీసీగా గెలుపొందడం చాలా సంతోషాన్ని కలిగిస్తోంది. నా గెలుపులో పాలుపంచుకున్న టిడిపి, జనసేనా, బిజెపి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, నాకు కొండంత ధైర్యంగా ఉండి నా గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన కూటమి నాయకులకు,కార్యకర్తలకు నా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# లింగాల సింగల్ విండో ఛైర్మన్‌గా కర్ణ నవీన్ కుమార్ రెడ్డి



**లింగాల మేజర్‌న్యూస్ :** లింగాల మండలం లింగాల సొసైటీ సీఈవో వినోద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు లింగాల మండల సొసైటీ సింగల్ విండో ఛైర్మన్ గా కర్ణ పాపయ్య పల్లి గ్రామానికి చెందిన కర్ణ, నవీన్ కుమార్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ నియామకంలో నెంబర్ గా కోమనూతల గ్రామానికి చెందిన, నాగిరెడ్డి గారి లక్ష్మిరెడ్డి, మరియు లో పట్నూతల గ్రామానికి చెందిన అలవలపాటి సుధాకర్ రెడ్డి, వీరు బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ సీఈవో వినోద్ కుమార్ వారికి శాలువాలు కప్పి సత్కరించారు. లింగాల సొసైటీ సింగల్ విండో ఛైర్మన్ కర్ణ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ సొసైటీ బ్యాంకు ఖాతాదారులందకి ఎటువంటి ఇబ్బందులు కలవకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటామని లింగాల సొసైటీని ప్రథమ స్థానంలో ఉండేలా చర్యలు తీసుకుంటానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఇంటింటా జాతీయ జెండా ర్యాలీ

### ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.లక్ష్మయ్య




**కమలాపురం మేజర్‌న్యూస్ :** కమలాపురంలోని సి ఎస్ ఎస్ ఆర్ ఎస్ ఆర్ ఆర్ ఎమ్ డిగ్రీ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఇంటింటా జాతీయ జెండా ర్యాలీ నిర్వహించడం జరిగింది. అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీగా ప్రభుత్వ ఆసుపత్రి వరకు వెళ్లారు. అక్కడ మానవహారంగా నిలబడి దేశం యొక్క ఔన్నత్యాన్ని గురించి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.లక్ష్మయ్య విద్యార్థులతో "మన దేశం ముద్దు - పరదేశం వద్దు", "దేశాన్ని గౌరవిస్తాం - దేశం కోసం ప్రాణాలిస్తాం" వంటి నినాదాలను పలికించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రెండవ ప్రోగ్రామ్ ఆఫీసర్ వై నాగ శిల్పా దేవి, శిరీష, ఎన్సిసి ఆఫీసర్ ప్రదీప్ కుమార్ రెడ్డి, డాక్టర్. ఎస్.నాగేంద్ర మరియు ఇతర శాఖల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# ఇటికలపాడు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ ముస్తాక్‌కు ఘనంగా వీడ్కోలు

### ఘనంగా సన్మానించిన వైసిపి జిల్లా ఆర్గనైజర్ సెక్రటరీ ప్రభాకర్ , గ్రామ ప్రజలు..

**బద్వేల్ (కాశి నాయన )మేజర్‌న్యూస్ :** బద్వేల్ నియోజకవర్గం లోని కాశి నాయన మండలం ఇటికలపాడు గ్రామంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ముస్తాక్ నెల్లూరు జిల్లాకి బదిలీ అయ్యారని విషయం తెలుసుకున్న స్థానిక ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు పరిధిలోని స్థానిక రైతులకు, ప్రజలకు అత్యుత్తమ బ్యాంకింగ్ సేవలు అందించారని బ్యాంకు పని నిమిత్తమై బ్యాంకు వద్దకు వెళ్ళినప్పుడు బాధ్యతారహితంగా వ్యవహరించి బ్యాంకు పరంగా ఉన్నతమైన సేవలు అందించారని వారి కొనియాడారు అదేవిధంగా రుణాల మంజూరు చేయడంలో, సకాలంలో రుణాలకు సంబంధించి వసూలు , ప్రజల అవసరాలపై గల అపారమైన నిబద్ధతతో ఆయన సేవలు అందించారు అన్నారు.ప్రస్తుతం ఆయన నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, రైతులు మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఆర్గనైజర్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి గారు,%శ్రీ% సతీమణి కలిసి ముస్తాక్ గారికి పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.రైతుల విధి నిర్వహణలో భాగంగా ఈ గ్రామానికి రావడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక ఉద్యోగి పట్ల గ్రామంలోని ప్రజలు చూపిన



సేవాభావం మరిచిపోని రోజులని ఆయన అన్నారు. ఫీల్డ్ ఆఫీసర్ మస్తాన్ గ్రామస్థులు పూలమాల శాలవా లతో హృదయపూర్వకంగా సన్మానించి , ఆయన సేవలు మరెన్నో ప్రాంతాల్లో కొనసాగాలని ఆశిస్తున్నామని వారు ఈ సందర్భంగా తెలిపారు.

# కాఫీ టీ షాపులు తనిఖీ

### పురపాలక కమిషనర్ రాముడు

**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల పట్టణ పరిధిలో ఉన్న కాఫీ టీ షాపులను పులివెందుల పురపాలక కమిషనర్ రాముడు తనిఖీలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపల్ కమిషనర్ డి.రాముడు వార్డు సచివాలయ శానిటరీ సెక్రటరీలతో కలిసి గురువారం కూడా ఉదయం పలు టీ మరియు కాఫీ షాపులను తనిఖీ చేశారు.నాణ్యమైన ఐ.ఎస్. ఐ.మార్క్ కలిగిన టి మరియు కాఫీ పొడులనే వాడాలని షాపు యజమానులకు సూచించారు.అంతేకాక టీ షాపుల యందు ప్రజారోగ్య హానికరమైన పేపర్ గ్లాస్ లను ఉపగించరాదు అన్నారు. అనంతరం వార్డు సచివాలయ శానిటరీ సెక్రటరీలు స్థానిక నగరి గుట్ట నందు ప్రజలకు స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమం లో భాగంగా తడి చెత్త,పొడి చెత్త లను వేరు చేసి పురపాలక చెత్త సేకరణ వాహనాలకు అందించే విషయమై ప్రజలకు



అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 32వ వార్డు ఎస్సీల పరిధిలోకి రావడం మా దౌర్భాగ్యమా..

# అభివృద్ధి పనులకి నోచుకోని వార్డు ప్రజలు

### బద్వేల్ మునిసిపల్ సమావేశంలో కమీషనర్‌ను నిలదీసిన వైసిపి కౌన్సలర్ బండి చెన్నయ్య

### కమీషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు అంటూ సమావేశంలో ఆరోపణ

### బద్వేల్ మునిసిపల్ పాలకవర్గం వైసిపి అయినప్పటికీ టిడిపికి కొమ్ముకాస్తున్నారు అంటూ ఆగ్రహం

**బద్వేల్ మేజర్‌న్యూస్ :** బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని 32 వ వార్డు ఎస్సీల పరిధిలోకి రావడం మా దౌర్భాగ్యమా అని అభివృద్ధి పనులలో భాగంగా సిమెంటు రోడ్డు నోచుకోని వార్డు ప్రజలు అంటూ గురువారం స్థానిక మునిసిపల్ కార్యాలయం సభా భవనంలో నిర్వహించిన కౌన్సిలర్ సర్వసభ్య సమావేశంలో బద్వేల్ మునిసిపల్ సమావేశంలో కమిషినర్ నిలదీసిన 32వ వార్డ్ వైసీపి కౌన్సలర్ బండి చెన్నయ్య మాట్లాడుతూ బద్వేల్ మునిసిపల్ కమిషినర్ నరసింహారెడ్డి పాలకవర్గం సంబంధించిన సభ్యుల సూచనలు సలహాలు పాటించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు అంటూ సమావేశంలో ప్రశ్నించారు.అంతేకాకుండా ప్రస్తుతం బద్వేల్ మునిసిపల్ పాలకవర్గం వైసిపి అయినప్పటికీ టిడిపికి కొమ్ముకాస్తు న్నారు అంటూ ఆయన మున్సిపల్ సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు.మున్సిపాలిటీ లో దాదాపుగా 50 సంవత్సరాల నుంచిసంవత్సరాలనుండి పన్నులు కడుతున్న కాలనీలకు కాకుండా ఈ మద్యకాలంలో గుంతపల్లి సమీపంలోని వీధిలో నూతనముగా ప్రైవేటు పాఠశాలను ఏర్పాటు చేసిన వారి కోసం అక్కడ కేవలం రెండు ఇల్లు నిర్మించుకొన్న వారి సౌకర్యం కొరకు ముప్పై లక్షలు ఖర్చు పెట్టి సీసీ రోడ్లు వెయ్యాలని మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో టెండర్లకు పిలిచామని తెలపడం అన్యాయం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మునిసిపల్ సర్వసభ్య సమావేశంలో 32 వ వార్డులో ఎస్సీలకు సంబంధించిన కాలనీలో సిమెంట్ రోడ్ ఏర్పాటు చేయాలని పలుసార్లు విన్నవించుకున్న దాటవేత ధోరణి తప్ప ఆచరణ లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలోని ప్రజలు మేమేదో వారికి అభివృద్ధి పథంగా అన్ని విధాల సహకరిస్తామని మమ్మల్ని ఓట్లేసి గెలిపిస్తే వార్డు ప్రజలకుఎలాంటి అభివృద్ధి పనులు జరగకపోవడంతో ప్రజలు








నిలదీస్తున్నారన్నారు. ఇప్పటికైనా మునిసిపల్ కమిషనర్ ఏకధోరణి విడనాడి సత్వరమే మా వార్డులో సిమెంటు రోడ్డు నిర్మాణం పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు.కౌన్సలర్ అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పమని ఎమ్మెల్యే డా.సుధా కమిషనర్ అడిగినా స్పందించకుండా తర్వాత వివరణ ఇస్తాను అంటూ మాట దాటవేయడం ఎంతటి వరకు సమంజసమని ఆయన సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు.

# ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

## – ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.జె.దీప్తి




**వేంపల్లె మేజర్‌న్యూస్ :** ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ విభాగం -3,12 అధికారులు అరుణ్ కుమార్ రెడ్డి, అనిత ల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించినట్లు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.జె.దీప్తి అన్నారు. గురువారం క్యాంపస్ లో విధ్యార్థులు జాతీయ జెండాలను చేతపట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్తా పాల్గొని మాట్లాడారు. ఆనాటి అమర వీరుల త్యాగఫలమే ఈనాటి మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్య దేశమన్నారు. ప్రతి ఒక్కరూ దేశం పట్ల భక్తీ శ్రద్ధలతో మెలిగి దేశ గౌరవాన్ని ప్రపంచం నలుమూలల చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి రవికుమార్, ఫైనాన్స్ అధికారి కోటేశ్వరి, ఎన్ఎస్ఎస్ అధికారులు సత్యానందం, గోవర్ధన్, సుధాకర్ రెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# దేశం అంత రాహుల్ గాంధీ వైపు చూస్తుంది

## ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాషా



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** దేశం అంత రాహుల్ గాంధీ వైపు చూస్తోందని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాషా తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం రాహుల్ గాంధీ మీద చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. ముఖ్యమంత్రిగా పని చేసిన వారు రాజకీయ సంప్రదాయాలు తెలిసిన వారు ఇలా మాట్లాడడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. మాణిక్యం టాగోర్ ని వాడు వీడు అని సంబోధించడం ఎంత వరకు సబబన్నారు. ఆయన ఒక పార్లమెంట్ సభ్యుడని, ఇలా సంబోధించడం మీ విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. వోట్ చోరీ ను నిరసిస్తూ పార్లమెంటు ఆవరణలో అన్ని పార్టీలకు చెందిన ఎంపీ లు నిరసన తెలియ చేస్తుంటే వైకాపా ఎంపీలు ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. తమ వైఖరేంటో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. 2029లో ఎవరికి మద్దతిస్తారో ప్రధాన మంత్రిగా ఎవరికి చూడాలని అనుకుంటున్నారో ప్రజలకు తెలియచేయాలన్నారు. ఈ రోజుకు కూడా ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా ఇవ్వాలని కట్టుబడి ఉన్న పార్టీ కాంగ్రెస్ పార్టీ కావాలో లేకుంటే మూడో సారి అధికారంలో వచ్చి కూడా ప్రత్యేక హోదా ఇవ్వని బీజేపీ కావాలో ప్రజలకు తెలియచేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలకు ఎవరు ముందుకు వస్తే వారికీ మద్దతు ఇస్తామని జగన్ మోహన్ రెడ్డి చెప్పిన మాటలు గుర్తు చేసారు. 2029 లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు అనేక రకాలుగా రాష్ట్రాన్ని అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ చేస్తుందని తెలియచేసారు.

# పెట్రోల్ బంకులో వాటర్ కల్తీ కాలేదు

## – హిందుస్థాన్ పెట్రోలియం సహకారంతో పెట్రోల్ టెస్ట్



**వేంపల్లె మేజర్‌న్యూస్ :** స్థానిక రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో ఉన్న జగన్ ఫీల్లింగ్ స్టేషన్‌లో ఎటువంటి వాటర్ కల్తీ జరగలేదని యజమాని నందకుమార్ రెడ్డి అన్నారు. పెట్రోల్ కల్తీ జరిగిందని సామాజిక మాధ్యమాల్లో, కొన్ని పత్రికల్లో వచ్చినట్లు తెలిపారు. హిందుస్థాన్ పెట్రోలియం సహకారంతో పెట్రోల్ టెస్ట్ నిర్వహించామని, వాటర్ పేస్ట్ ద్వారా డిప్ వేసి చేక్ చేయించామన్నారు. ఒకవేళ పెట్రోల్ ట్యాంకర్ లో నీళ్లు ఉంటే డిప్ వేసినప్పుడు పిక్ కలర్ మారుతుందన్నారు. తమ పెట్రోల్ బంకులో టెస్ట్ చేసినప్పుడు ఎలాంటి రంగు మారలేదన్నారు. అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన పెట్రోల్ అందిస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ ఎవరికైనా అనుమానం ఉంటే శ్యాంపుల్ టెస్ట్‌లను కస్టమర్‌ల ముందే చూపిస్తామన్నారు.

# వివక్ష వీడండి అభివృద్ధి వైపు అడుగేయండి

## – ప్రతీకార రాజకీయాలతో ప్రజలను ఇబ్బంది పెట్టడం సరైంది కాదు

## – కూటమి ప్రభుత్వానికి సిపిఐ పిలుపు




**వేంపల్లె మేజర్‌న్యూస్ :** వివక్షను వీడి.. అభివృద్ధి వైపు అడుగేయాలని సిపిఐ పులివెందుల ప్రాంతీయ కార్యదర్శి వెంకట రాములు అన్నారు. గురువారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోనీ ప్రధాన రోడ్లను పరిశీలించారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏర్పడిన గుంతల్లో నిలబడి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేంపల్లె పట్టణంలో నెలకొన్న అసంపూర్తి రోడ్ల పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 మాసాలైనప్పటికీ పట్టించుకోక పోవడం ప్రజలపైన వివక్షనేనన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లను పూర్తి చేస్తామని గత ఎన్నికల్లో టిడిపి ఇంఛార్జి బిటెక్ రవి చెప్పారన్నారు. ఇప్పుడు ప్రజలను వర్షానికి వదిలేశారని తెలిపారు. ఇప్పటికైనా కూటమి నాయకులు అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో ప్రజల మద్దతుతో ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు బుర్రి ఈశ్వరయ్య, నాయకులు మల్లేష్, అంజనప్ప, అమీర్, ఈశ్వరయ్య, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల తీర్పుతో నైనా జగన్ మారాలి



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలలో ప్రజల తీర్పుతో నైనా జగన్ మారాలని తెలుగుదేశంపార్టీ బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మంగళవారం జరిగిన ఉప ఎన్నికలలో పులివెందుల, ఒంటిమిట్ట రెండు జెడ్పీటీసీలు తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం కైవసం చేసుకోవడం శుభపరిణామమన్నారు. దాదాపు ముప్పై యేళ్లుగా ప్రజలను ఓటు అనే పదానికి దూరం చేసి, ప్రత్యర్థులు కనీసం నామినేషన్ కూడా వేయనీయకుండా బెదిరింపులు, కిడ్నాపులతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేసి అరాచక పాలన సాగిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి నిరంకుశంగా వ్యవహరించిన వైఎస్.జగన్ అహంకారానికి, ఆధిపత్యానికి చెంపపెట్టులా నేడు పులివెందుల ప్రజలిచ్చిన తీర్పును అభినందిస్తూ, కూటమి ప్రభుత్వంలో ముప్పై యేళ్ల తర్వాత ప్రజాస్వామ్య బద్ధంగా తమ ఓటు హక్కును వినియోగించుకుని పులివెందులకు పసుపు రాసి శుద్ధి చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. జగన్ కు అచ్చొచ్చిన పదకొండు మంది పోటీ చేయడం ఏదైతే ఉందో అది దేవుడి స్క్రిప్ట్ గా భావిస్తూ, ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైనాట్ పులివెందుల అని సవాల్ విసిరుతూ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నందమూరి యువసేవాసమితి అధ్యక్షులు గోమేధికమ్ సుదర్శన్, జనసేన నాయకులు కందుల బాలసుబ్రహ్మణ్యం, బూత్ కన్వీనర్లు బి.వెంకటరమణ, సీనియర్ నాయకులు ఎద్దుల చంద్రమోహన్ రెడ్డి, ఉండేల రమణారెడ్డి, ఎస్సీ నాయకులు కల్లూరు బాలరాజు, ప్రవీణ్, సన్న, తెలుగుదేశం పార్టీ యువనాయకులు చింతా శ్రీకాంత్ రెడ్డి, పేట సురేష్, మంజుల బాష, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంగడి వీధి జిల్లా పరిషత్ పాఠశాలకు మార్చ్ ఫాస్ట్ డ్రమ్స్ బహూకరణ



**చింతకొమ్మదిన్నె మేజర్‌న్యూస్ :** చింతకొమ్మదిన్నె మండలంలోని అంగడి వీధి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అవసరమైన డ్రమ్స్ లేవని తెలుసుకున్న ఆ పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు సుకుమారి సొంత ఖర్చుతో 12,000 విలువైన డ్రమ్స్‌ను పాఠశాలకు బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు అగ్గీరప్ప మాట్లాడుతూ, "ఈ డ్రమ్స్‌తో మార్చ్ ఫాస్ట్ మాత్రమే కాకుండా, విద్యార్థుల కళాత్మక నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలను కూడా నిర్వహించవచ్చు" అని తెలిపారు. డ్రమ్స్‌ను అందజేసిన ఉపాధ్యాయురాలికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రవేట్ పాఠశాలలో ఉచిత ప్రవేశాలకు ఆహ్వానం

## – మండల విద్యాశాఖ అధికారులు రమణయ్య, భాస్కర్

**దువ్వూరు మేజర్‌న్యూస్ :** దువ్వూరు మండలంలోని ప్రైవేట్ పాఠశాలలలో ప్రవేశాలకుగడువు కొరకు ఆగస్టు12 మంచి ఆగస్టు 20 వ తేది వరకు దరఖస్తు చేసు కోవచ్చునని మండల విద్యా శాఖధికారులు రమణయ్య, భాస్కర్ లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్య హక్కు చట్టం 2009 ప్రకారం అన్ ఎయిడెడ్ పాఠశాలలో ఉచిత విద్య కోసం అర్హత కలిగిన పిల్లలు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చని వారు తెలిపారు. 5 సంవత్సరములు పూర్తయిన పిల్లలకు ప్రథమ తరగతి లో మిగిలిన 25 శాతం సీట్ల భర్తీ కోసం ఈ అవకాశాన్ని కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓబీసీ, ఓసి వర్గాలకు చెందిన పిల్లలు అర్హులని తెలిపారు. దరఖాస్తుకు కావలసినవి : ( జనన ధృవీకరణ పత్రం ) ఆదాయ సర్టిఫికేట్, కుల ధ్రువీకరణ పత్రం , నివాస ధ్రువీకరణ పత్రం , ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజు రెండు ఫోటోలు దరఖాస్తుతో జతపరచాలని అధికారులు తెలిపారు. వెబ్ సైట్ సి ఎస్ ఈ. ఎ పి.గవర్నమెంట్ ఇన్ ద్వారా ఆన్ లైన్ చేసుకోవచ్చు అని వారు తెలిపారు.

# బుఖారియా ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్‌గా సయ్యద్ సలీం బుఖారి



**కడప టౌన్, మేజర్‌న్యూస్ :** కడప నగరంలోని అమీన్ పీర్ రోడ్ లో ఉన్న బుఖారియా ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలో గురువారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సొసైటీ వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ మొహమ్మద్ బుఖారి మాట్లాడుతూ పూర్వ ప్రెసిడెంట్ సయ్యద్ అక్బర్ బుఖారి స్వర్గస్తులైనందుకు ఆయన స్థానంలో వారి తనయుడు సయ్యద్ సలీం బుఖారి ను సొసైటీ ప్రెసిడెంట్ గా సభ్యులు ఎన్నుకోవడం జరిగిందన్నారు. బుఖారియా ఎడ్యుకేషనల్ సొసైటీ లో మదీనా ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేశారని, ఆ కళాశాలకు మళ్లీ పూర్వ వైభవంగా తీసుకొస్తామని, అదే కాకుండా విద్యాపరంగా మరిన్ని సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సొసైటీ సెక్రటరీగా సంఘం షేక్ నసీరుద్దీన్ అందించిన సేవలు ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం సొసైటీ నూతన ప్రెసిడెంట్ గా ఎన్నికైన సయ్యద్ సలీం బుఖారి ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ సంఘం షేక్ నసీరుద్దీన్, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ మొహమ్మద్ బుఖారి ట్రెజరర్ ఎస్ కె కలిముద్దీన్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# గోపవరం గ్రామంలో హర్ ఘర్ తిరంగా వేడుకలు



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులతో కలిసి గోపవరం గ్రామంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి, గ్రామస్తులకు భారత జాతీయ పతాకాలు పంపిణీ చేశారు. తిరంగా పతాకం వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా, దేశ నిర్మాణంలో మన సమిష్టి కట్టుబాటును ప్రతిబింబిస్తుందనే సందేశాన్ని అందించారు. ఈ కార్య క్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓ డాక్టర్ డి. ఇందిర, ఫ్యాకల్టీ డాక్టర్ జీవన, భరత్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు సుధారాణి,జహంగీర్, రామనారెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

# భాష్యం స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

## రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** భాష్యం స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని లింగమయ్య వెంకట్ నాయక్ అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ పట్టణంలోని భాష్యం స్కూల్ యజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ఎటువంటి లేబర్ పనులు చేపించకూడదని చట్టం చెబుతున్నా వాటిని లెక్కచేయకుండా విద్యార్థులతో ఆగస్టు 15 రంగు కాగితాలు స్కూల్ ఆవరణంలో అతికించుటకు మల్లెలమ్మ గుడి దగ్గర బాడుగకు తీసుకున్న 15 అడుగుల ఎత్తు 100 కిలోల బరువున్న నిచ్చెనను దాదాపు కిలోమీటర్ దూరంలో ఉన్న భాష్యం స్కూల్ దగ్గరకు 12 మంది విద్యార్థులతో ఇక్కడ నుండి స్కూల్ వరకు మోపించారని వారు విమర్శించారు. ఈ విధంగా విద్యార్థులతో లేబర్ పని చేయించడం ద్వారా తెలిసి తెలియని పిల్లలు కాబట్టి అంత పెద్ద స్టాండ్ ను ఒకవేళ ఎత్తుకొని సందర్భంలో ఎవరో ఒకరి మీద పడడం జరుగుతే కాళ్లు చేతులు విరగడమే కాకుండా జరగరాని సంఘటనలు జరుగుతాయని వారు విమర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ లేబర్ వాళ్లు చేసే పనిని పిల్లలతో చేపించడం అన్యాయం అని వారన్నారు. ఏదైనా స్కూల్లో పని చేయించాలంటే లేబర్ వారిని పిలిపించి చేపించాల్సిన పనిని విద్యార్థులతో చేపించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భాష్యం స్కూల్ యజమాన్యం స్టాండ్ ను ఆటోలో తీసుకొని వస్తే ఆటో వారికి 200 బాడుగ ఇవ్వవలసి వస్తుందని కక్కుర్తి పడి విద్యార్థులతో లేబర్ పని చేయించిన భాష్యం స్కూల్ యాజమాన్యంపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకొని వాటి గుర్తింపు రద్దు చేయాలని, లేని పక్షంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

# గీతాశ్రమంలో కృష్ణ జయంతి మహోత్సవం

**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** స్థానిక గీతాశ్రమం వీధిలోని నామా ఎరికలయ్య ఆశ్రమం (శ్రీ కృష్ణ గీతాశ్రమంలో) రేపు కృష్ణ జయంతి మహోత్సవం నిర్వహిస్తున్నామని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉదయం పుష్పాభిషేకం, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం హారతి, ప్రవచనాలు తదుపరి హరికథా రత్న యడవల్లి రమణయ్య చే హరికథా కాలక్షేపం జరుగుతుందని వివరించారు. కావున భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

# వైసిపిని, బద్దలుకొట్టి, టిడిపి భారీ మెజారిటీతో టిడిపి కార్యకర్తలు సంబరాలు

**కలసపాడు: మేజర్‌న్యూస్ :** కలసపాడులో మూడు రోడ్ల కూడలి నందు గురు వారం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఆనంద ఉత్సవాలతో గత 30 సంవత్సరాల వైసిపి కోటను బద్దలు కొట్టిన టిడిపి జడ్పిటిసి సభ్యులుగా పోటీ చేసి విజయ కేతనం ఎగురవేసిన పులివెందుల జడ్పిటిసి, ఎం లలితా రెడ్డి, ఒంటిమిట్ట జెడ్పిటిసి ఎన్నికలలోముద్దు కృష్ణారెడ్డి 6267ఓట్లమేజరిటీ తో విజయం సాధించారు కడప జిల్లాలో ఇటీవల జరిగిన జడ్పిటిసి ఎన్నికలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో పులివెందుల సిద్ధవటం జడ్పిటిసి భారీ మెజార్టీ రావడం టిడిపి కార్యకర్తలు సంబరాలు చూసుకున్నారు మండల టిడిపి నాయకులు శ్రావణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కడప జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ల ఆధ్వర్యంలో పులివెందుల నియోజకవర్గంలో చాలా కాలంగా టిడిపి అభ్యర్థులను ఎన్నికలలో పోటీ చేసిన వారిని గెలవనివ్వకుండా చేసేవారని అదేవిధంగా వైయస్ఆర్ తనయుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సొంత గ్రామమైన పులివెందులలో టిడిపి మరియు మాజీ సీ.ఎం.సొంత జిల్లాలో తెలుగుదేశం పార్టీ జడ్పిటిసి అభ్యర్థులుగా పులివెందులలో శ్రీమతి ఎం. లతా రెడ్డి ,వైసీపీ అభ్యర్థి హేమంత్ రెడ్డిపై 6033ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అదేవిధంగా జిల్లాలోని ఒంటిమిట్ట మండల జడ్పిటిసి ఎన్నికలలో వైసిపి అభ్యర్థి సుబ్బారెడ్డి పై పోటీ చేసిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ముద్దుకృష్ణారెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిచారని, వైసీపీ తరపున పోటీ చేసిన అభ్యర్థి పై 6267ఓట్లతోతేడాతో తెలుగుదేశం పార్టీ జడ్పీటీసీ ముద్దు కృష్ణారెడ్డి సాధించారు ఎమ్మెల్సీ బీటెక్ రవి నాయకత్వంలోటిడిపి నాయకులు కార్యకర్తల ఆనందోత్స వాలను అనుసరిస్తూ బద్వేల్ నియోజకవర్గం లోని కలసపాడు మండలం నందు తెలుగుదేశం పార్టీ నాయకులు అభిమానులు ప్రజాప్రతినిధులు టిడిపి కార్యకర్తలు ఆనందోత్సాహాలతో సంబరాలు



చేసుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు యువ నాయకుడు లోకేష్ కు అభినందనలు తెలుపుతూ కలసపాడు లో మండల టిడిపి నాయకుడు. బుస్కే శ్రవణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో దద్దరిల్లిన ప్రజా ఉద్యమం ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయని కలసపాడు నందు స్వీట్లు పంపిణీ చేసుకుంటూఆనంద,ఉత్సవాలతో, టిడిపి కార్యకర్తలు, ఆనందోత్సాహాల మధ్య సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి మరియు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సొంత గ్రామం అయినా పులివెందులలో గత 30 సంవత్సరాల రాజకీయ ముసుగునుంచి వైసీపీని బద్దలు కొట్టిన టిడిపి అత్యధిక మెజార్టీ ఓట్లు రావడంతో టిడిపి శ్రేణులు సంబరాలుచేసుకుంటున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారీ మెజార్టీ గెలుపొందారు ఈకార్యక్రమంనందు మండల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని మృతదేహానికి గౌరవప్రదమైన అంత్యక్రియలు



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ మార్చురీ నందు గుర్తుతెలియని వ్యక్తి ఎర్రగుంట్ల పరిదిలో రైలు ప్రమాదంలో మరణించగా మృతదేహాన్ని ఉంచగా అంతిమ సంస్కరణలు చేయడానికి నాలుగు రోజులు బంధువులు ఎవరు లేకపోవడంతో ఎర్రగుంట్ల రైల్వే పోలీసు సిబ్బంది ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్ ను సంప్రదించగా వారు వెంటనే స్పందించి గురువారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్, ట్రెజరర్ భార్గవ్ సాయి, కృప అగ్ని షారూన్ ట్రస్ట్ సభ్యులు పాపిశెట్టి వెంకట లక్ష్మమ్మ, సుమన్ బాబు, ప్రసన్న కుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

## - డాక్టర్ ఎన్ తులసిరెడ్డి



**వేంపల్లె మేజర్‌న్యూస్ :** రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, చంద్రబాబు హాట్ లైన్ లో మాట్లాడుకుంటూ ఉంటారని, ఆంధ్రలో దొంగఓట్లపై రాహుల్ గాంధీ మాట్లాడడం లేదని, కాంగ్రెస్ ఒక పార్టీయైన అని వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం, అవివేకమని కాంగ్రెస్ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎన్ తులసిరెడ్డి అన్నారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలైన వైకాపా, టీడీపీ, జనసేన లు నరేంద్ర మోడీ, అమిత్ షా చేతిలో కీలుబొమ్మలని, కబాలీలని పేర్కొన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ, ప్రధాన రాజకీయ ప్రత్యర్థి బిజెపి పార్టీ.. అటువంటి బిజెపి నాయకత్వంలో టిడిపి భాగస్వామి అన్నారు. ఆ ఎన్డీఏ కూటమికి నాయకుడు చంద్రబాబు, అయితే రాహుల్ గాంధీ హాట్ లైన్ లో మాట్లాడుతున్నారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే కాంగ్రెస్ ఒక పార్టీయైన అని జగన్ వ్యాఖ్యలు గర్హనీయం అన్నారు. ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్, నవభారత నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని తులసిరెడ్డి శ్లాఘించారు. దేశ భక్తుల, త్యాగధనుల పార్టీ కాంగ్రెస్ అని, అనేక ఏళ్లు దేశాన్ని, రాష్ట్రాన్ని పరిపాలించిన పార్టీ అన్నారు. దివంగత వైఎస్ఆర్ ఏ పార్టీ నుంచి గెలిచారు? కాంగ్రెస్ నుంచి కాదా అని ప్రశ్నించారు. వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయ ప్రస్థానం ఏ పార్టీతో ప్రారంభమైందని, కాంగ్రెస్ తో కాదా అంటూ ప్రశ్నించారు. అలాంటి పార్టీని జగన్ అవాకులు, చవాకులు పేలడం శోచనీయమన్నారు.

# శ్రీ కృష్ణాష్టమి వేడుకలు సందడిగా

## శుభాకాంక్షలు తెలిపిన - కరస్పాండెంట్ ఆంజనేయులు (అంజి)

**వల్లూరు మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని శ్రీ యాదల శేషగిరి మెమోరియల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గురువారం నాడు ఘనంగా ముందస్తు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో విద్యార్థులు కృష్ణుడు, యశోద మరియు గోపికల వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు, రంగురంగుల వేషాలతో చిన్నారులు, అవతారాలు ధరించరు, స్కూల్ కరస్పాండెంట్ ఆంజనేయులు (అంజి) మాట్లాడుతూ సాంస్కృతిక విలువలతో కూడిన ఈ వేడుకలు విద్యార్థుల్లో భక్తి భావన పెంపొందించడమే కాకుండా, వారిలోని సృజనాత్మకతను బయటకు తీసేందుకు దోహదపడతాయి అన్నారు, స్కూల్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం విజ్ఞానంతో పాటు



వినోదానికి మేళవింపు అయింది, సందడిగా ఒకరికొకరు ముందస్తు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు..

# పులివెందుల జడ్పీటీసీ..టీడీపీ కైవసం

**పులివెందుల ప్రజలకు రుణపడి ఉంటాను - ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్లే నేను గెలిచాను - జడ్పీటిసి మారెడ్డి లతారెడ్డి**

**పులివెందుల మేజర్‌న్యూస్ :** ఈనెల 12వ తారీకు 13వ తారీకు జరిగిన జడ్పిటిసి ఎన్నికలలో 14 వ తారీకు ఎన్నికల లెక్కింపులో భారీ మెజారిటీతో పులివెందుల జడ్పీటీసీ స్థానాన్ని.టీడీపీ కైవసం చేసుకోవడం జరిగిందని పులివెందుల ప్రజలకు రుణపడి ఉంటానని, ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్లే నేను గెలిచాను జడ్పిటిసి మారెడ్డి లతారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో పులివెందులలో ధైర్యంగా ఓట్లు వేసే పరిస్థితిలు లేవని, ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకునే ఏర్పాటు చేస్తామని ప్రజలకు భరోసా ఇచ్చాం అని,గతంలో పోలింగ్ కేంద్రాలకు రానీయకుండా చేశారు. ఇవాళ స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఓట్లు వేశారని, జగన్ మోహన్ రెడ్డికి బుద్ధి చెప్పాలని ప్రజల ఆలోచన చేశారని, టిడిపి పథకాలే నా విజయానికి విజయానికి కారణమని,జనం మాటలు జగన్ కు వినిపిస్తే ఆత్మహత్య చేసుకుంటాడని, నువ్వు రపా రఫా అన్నావ్ ఈ జడ్పీటిసి ఉప ఎన్నికలో పులివెందుల ప్రజలే నిన్ను రఫా రఫా అని టిడిపి గెలుపుతో చూపించారని అన్నారు. ఏదేమైనాప్పటికీ పులివెందుల ప్రాంత ప్రజలకు వారి అభివృద్ధికి వెన్నంటి తోడు ఉండి కృషి చేస్తానని తెలియజేస్తూ ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



# జగన్ కంచుకోట బద్ధలైంది

**జగన్ సొంత ఇలాఖాలోనే టీడీపీ జెండా**

**జడ్పిటిసి లతా రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలుపు**



**పులివెందుల మేజర్‌న్యూస్ :** జగన్ కు పులివెందుల ప్రజలు దిమ్మతిరిగే షాకిచ్చారు. పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నికలో టీడీపీ విజయ దుందుభి మోగించింది. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గం లో కొన్ని సంవత్సరాలుగా ఉన్నటువంటి వైసీపీ కంచుకోట ను ఈ ఆగస్టు 15 ముందే ఒక్క రోజు స్వాతంత్రం పులివెందుల నియోజకవర్గం ప్రజలకు స్వాతంత్రం వచ్చిందని, ప్రతి ఒక్కరూ నా సతీమణి లతారెడ్డిని ఆదరించి మెజారిటీతో గెలిపించడం జరిగిందని. పులివెందుల మండల గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సంక్షేమ పథకాలను వారికి అందిస్తూ, ప్రజా సేవకు అనునిత్యం అందుబాటులో ఉండి సేవలు అందిస్తుందని, తనను గెలిపించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సంక్షేమశాఖ మంత్రి సవిత ,జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబరాలు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు అభిమానులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దవంక లోలెవెల్ కాజువేతో అవస్థలు

**గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు**

**రాజుపాళెం,మేజర్‌న్యూస్ :** వర్షాకాలంకుందూ నదికి వరద నీరు వచ్చినప్పుడు పగిడాల-వెల్లాల గ్రామాల మధ్య పెద్ద వంకతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు గత రెండు మూడు రోజులుగా పుణ్యక్షేత్రమైన వెల్లాలకు చేరుకోవాలంటే భక్తులు అవస్థలు పడాల్సి వస్తోంది ఈ పెద్ద వంక వద్ద రాకపోకలు నిలిచిపోయాయి కుమ్మరపల్లె బైపాస్ రోడ్డు తిరిగి వెల్లాలకు రావలసి రావడంతో అవస్థలు పడాల్సి వస్తోంది పుణ్యక్షేత్రమైన వెల్లాలలో బాలికల గురుకుల పాఠశాలకు వచ్చే ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు ఇబ్బందిగా మారిందిఇటీవల నంద్యాల ఆపైతట్టు ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు కుందూ నది వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది పుణ్యక్షేత్రమైన వెల్లాల సమీపంలోని కుందూ నదిపై నిర్మించిన పాత వంతెన పై ఐదు అడుగుల మేర వర్షం నీరు ప్రవహించింది నదికి వచ్చే వరదనీరు రివర్స్ లోపెద్ద వంకకు చేరడంతో ఇక్కడ రాకపోకలకు ఇబ్బందిగా మారింది పెద్దవంక పై నిర్మించిన లో లెవెల్ కాజువే పై ఉధృతంగా వర్షం నీరు ప్రవహిస్తోంది కుందూనది వరద నీరే కాకుండా వర్షాకాలంలో మండలంలో నిపర్లపాడు ఆపై తట్టు గ్రామ పొలాల నుంచి వచ్చే వర్షం నీరు పెద్దవంకకు



చేరడంతో ఎక్కువ స్థాయిలో వంకలో ప్రవాహం అధికంగా ఉంది పాత లో లెవెల్ కాజు వే స్థానంలో ఆర్ అండ్ బి అధికారులు హై లెవెల్ వంతెన నిర్మించాలని భక్తులు వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు

# బ్రహ్మంగారిని దర్శించుకున్న ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి

**సన్మానించిన స్నేహితులు, శ్రేయోభిలాషులు**



**బ్రహ్మంగారిమఠం మేజర్‌న్యూస్ :** శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని దర్శించుకున్న ట్రైనీ కలెక్టర్ నేలటూరు శ్రీకాంత్ రెడ్డి కి తమ స్నేహితులు, శ్రేయోభిలాషులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. చెన్నూరు గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి కుమారుడు శ్రీకాంత్ రెడ్డి సివిల్స్ లో మంచి ర్యాంకు సంపాదించి కలెక్టర్ గా ఎంపిక అయ్యారు. శుక్రవారం ట్రైనింగ్ నిమిత్తం విధులలో వెళ్ళాలి, ఈ సందర్భముగా ఆయన కుటుంబ సభ్యులు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వాముల వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు బ్రహ్మంగారి మఠం దేవస్థాన మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి, పూర్వపు మఠాధి పతి కుమారుడు శ్రీ దత్తాత్రేయ స్వామి స్వాగతం పలికి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదలను అందజేశారు .అనంతరం ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి వారి తల్లి తండ్రులకు స్థానికంగా ఉన్న ఆయన తండ్రి సుబ్బారెడ్డి స్నేహితులు తెలుగుదేశం మండల నాయకులు ఎస్సార్ శ్రీనివాసులు రెడ్డి , డిప్యూటీ తాసిల్దార్ జాన్సన్ రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ సాంబశివారెడ్డి , వీఆర్వో కాశి , బద్దెల శ్యాంసుందర్ రెడ్డి,శీలం లక్ష్మీ నరసయ్య గౌడ్, తెలుగుదేశం ఉపాధ్యక్షుడు శీలం నరసింహ గౌడ్, ఇటుకల రవికుమార్ గౌడ్, శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు.

# టి.డి.పి గెలుపు బలుపు కాదు వాపు

**ప్రజాస్వామ్యం ఓడింది.. ఇది టిడిపి పతనానికి నాంది**

**తీవ్రస్థాయిలో మండిపడ్డ వైయస్సార్ సిపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి**

**కడప - మేజర్‌న్యూస్ :** పులివెందుల, ఒంటిమిట్ట జెడ్.పి.టి.సి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు బలుపు కాదని వాపు అని ఈ ఎన్నికల్లో టి.డి.పి గెలిచింది... ప్రజాస్వామ్యం ఓడిందని ఈ గెలుపు ప్రజాస్వామ్య బద్దంగా గెలిచిందనడం సిగ్గుచేటున్నారు దీనికోసం బాణసంచా పేల్చడం, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు చేసుకోవడం ప్రపంచంలో ఎనిమిదో వింత అని వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి, కమలాపురం, బద్వేలు నియోజకవర్గాల పరిశీలకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కడప నగరంలోని వైయస్సార్ సిపి జిల్లా కార్యాలయంలో గురువారం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ... పులివెందులలో 6,033 ఓట్లతో, ఒంటిమిట్టలో 6,267 ఓట్లతో గెలిచామని జబ్బలు చరచుకోవడంపై ఎద్దేవా చేస్తూ ఈ గెలుపు పోలీసుల, ఎన్నికల కమిషన్ ల, కూటమి కిరాయి గుండాల గెలుపని, ఇది ముమ్మాటికి టి.డి.పి గెలుపే కాదని ఆయన స్పష్టం చేశారు.10, 600 ఓట్లు పులివెందుల జెడ్.పి.టి.సికి ఉంటే దానికి ఒక డి.ఐ.జి ని, వందలాది పోలీసుల్ని, ఎస్.ఐ సి.ఐ, డి.ఎస్.పి స్థాయి అధికారులను పెట్టి వారి ద్వారా వైయస్సార్ సిపీ వారిని ఓటింగ్ కు రాకుండా నిలువరించి, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వారితో ఓట్లు వేయించడం, వేరే ప్రాంతాల నుండి వచ్చిన గూండాలకు స్వాగతం పలకడం, ఓటర్లను బూతుల్లోకి వెళ్ళకుండా చేయడం, ఏజెంట్లను, అభ్యర్థిని సైతం బూతుల్లోకి వెళ్లకుండా చేసి అక్రమాలతో గెలిచి న్యాయం, ధర్మం గెలిచిందనటం, ఏడాది పాలనలో సంక్షేమ కార్యక్రమాలు నెరవేర్చడంతో విజయదుందుబి మ్రోగించిందని కూటమి నేతలు మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఆయన ఎద్దేవా చేశారు.1995వ సంవత్సరంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలోని వేముల, వేంపల్లి, లింగాల, తొండూరు మండలాల్లో జెడ్.పి.టి.సి, ఎం.పీ.పీ ఎన్నికల్లో కాంగ్రెస్ పై తెలుగుదేశం పార్టీ పోటీ చేస్తే వేముల, వేంపల్లె, లింగాల జడ్.పి.టి.సిలు. వేముల, వేంపల్లె ఎం.పీ.పీలు గెలవలేదా? ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికలకు నాడు డా.వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబం సహకరించకపోతే తెలుగుదేశం పార్టీ ఎలా గెలిచిందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.డా.వై.ఎస్.ఆర్ కుటుంబ సభ్యులను రాక్షసులుగా, దుర్మార్గులుగా చిత్రీకరించి 40 ఏళ్లకు పైబడి డా॥వై.ఎస్.ఆర్ కుటుంబం




తెదేపా వారిని స్థానిక సంస్థల్లో నామినేషన్ వేయించలేదని విషం చిమ్మడం సిగ్గుచేటని ఈ ఎన్నికలే టి.డి.పి పతనానికి నాంది అని ఆయన పేర్కొన్నారు. తాము ఇప్పుడే కొత్తగా ప్రజాస్వామ్య బద్ధంగా గెలిచామని నేటి కుహనా మేధావులు చంకలు గుద్దుకోవడం, జబ్బలు చరచడం ఏమిటని నిలదీస్తూ... ఈ గెలుపుకు సంబరాలు చేసుకోవడం ఎవరికో పుట్టిన బిడ్డకు తామే తండ్రినని చెప్పుకోవడం లాంటిదేనని ఆయన నిశతంగా విమర్శించారు. ఆగస్టు 2017న నంద్యాల ఉప ఎన్నికల్లో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలను మభ్యపెట్టి, అలవికాని, ఆచరణ సాధ్యంకానీ హామీలనిచ్చి, అధికార దుర్వినియోగం చేసి 27,000 ఓట్లతో గెలిచారని దాంతో వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి పని అయిపోయిందని, వైయస్సార్ సిపి భూస్థాపితం అవుతుందని తెలుగుదేశం పార్టీ నేతలంతా ముఖ్యమంత్రి మొదలు కార్యకర్తల వరకు అవాకులు, చవాకులు ప్రేలారన్నారు. కానీ. అనంతరం జరిగిన ఎన్నికల్లో 151 సీట్లలో ఘనవిజయం సాధించి 30 మే 2019న వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయలేదా? అని నిలదీస్తూ... తిరిగి ఇదే పునరావృతం కావడం వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావడం తథ్యమని రెడ్యం విశదీకరించారు. కూటమి నేతలు విషం చిమ్మడం కాదని దమ్ము, ధైర్యం ఉంటే పారా మిలిటరీ దళాలతో, కేంద్ర ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో ఎన్నికలు జరిపితే ఇప్పుడు వచ్చిన అన్ని ఓట్లు వస్తే వై.ఎస్ జగన్ రాజకీయాల్లో ఉండరని,రాకుంటే చంద్రబాబు నాయుడు రాజకీయాల నుండి తప్పుకుంటారా? అని రెడ్యం సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ సిపి నేతలు మల్లె ఓబయ్య యాదవ్, రెడ్యం నాగేశ్వర్ రెడ్డి, మున్నెల్లి సుబ్బరాయుడులు పాల్గొన్నారు.

## నవోదయ'లో ఆరో తరగతి ప్రవేశాలు.. మళ్లీ గడువు పొడిగింపు



**కడప ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశాల దరఖాస్తుల గడువును మరోసారి పొడిగించారు. ఆగస్టు 27వరకు పొడిగించారు. దేశవ్యాప్తంగా 654 జేఎన్‌వీల్లో 2026–27 విద్యా సంవత్సరానికి రెండు విడతల్లో ప్రవేశ పరీక్షలు జరగనున్నాయి. మొదటి విడత 2025 డిసెంబర్ 13న, రెండో విడత 2026 ఏప్రిల్ 11న నిర్వహిస్తారు. 75% సీట్లు గ్రామీణ విద్యార్థులకు, మిగతావి పట్టణ విద్యార్థులకు కేటాయిస్తారు. ఒక్కో పాఠశాలలో 80 సీట్లు ఉండగా,పరీక్ష 100 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.

## సాయినాధునికి ప్రత్యేక పూజలు



**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల పట్టణంలోనిపార్నపల్లి రోడ్డు సమీపంలో కొలువై ఉన్న మొట్టమొదటి శిరిడి సాయిబాబా ఆలయంలో శ్రావణమాసం గురువారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఉదయా స్తమాన స్వామివారికి ఆలయ అర్చకులు మురళి స్వామి పంచామృత అభిషేకం సహస్రనామార్చన ప్రత్యేక అలం కరణ మంగళహారతులు తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనాన్ని కలిగించాటూరు . ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ ఎంతో పురాతనమైన ప్రసిద్ధిగాంచిన పులివెందులలో మొట్ట మొదట కొలువై ఉన్న శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో ప్రతి గురువారం భక్తుల సహాయ సహకారాలతో పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, స్వామివారిపై ఎంతో నమ్మకముతో ఆలయానికి వచ్చి భక్తులు తమ మొక్కులు చెల్లించుకుని పూజలు నిర్వహించడం జరుగుతోందని తెలియజేశారు . అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి సేవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పులివెందులలో తెలుగుదేశం విజయభేరి

### తెలుగు తమ్ముళ్ల సంబరాలు



**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల జడ్పిటిసి ఎన్నికల్లో ఘన విజయం సాధించినటువంటి మా రెడ్డి లత కి పులివెందుల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ ప్రాంతీయ కార్యాలయం నందు అభినందనలు తెలుపుతూ స్వీట్ తినిపిస్తున్నటువంటి రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్. మహబూబ్ బాషా, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసిం వల్లి లు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మహబూబ్ బాషా గారు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా పులివెందుల మండల జడ్పిటిసి ఎన్నికలను వైఎస్ కుటుంబం రాజకీయంగా కక్షపూరిత మరియు హింసాత్మక చర్యలతో ప్రత్యర్థులను నామినేషన్ వేయనికుండా ఏకపక్ష రాజకీయం చేస్తూ వచ్చారు, కానీ ఈ యొక్క 2025 సంవత్సరంలో ఎన్నడూ లేని విధంగా బీటెక్ రవి వారి యొక్క సతీమణి మారెడ్డి. లత ని తెదేపా అభ్యర్థిగా నిలబెట్టి పులివెందుల కంచుకోట ను బద్దలు కొట్టి తెలుగుదేశం జెండాను నాటి సతీమణి అయినటువంటి లత ని టిడిపి శ్రేణులతో కలిసి అహర్నిశలు ఈ యొక్క ఎన్నికల్లో ప్రతి ఒక్క టిడిపి కార్యకర్త చురుగ్గా పనిచేసి మా లతమ్మ విజయానికి కృషి చేయడం జరిగింది . అలాగే పులివెందులలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామ న్నారు. ఈ యొక్క జడ్పిటిసి ఎన్నికల్లో ప్రధాన పాత్ర పోషించి నటువంటి ఇంచార్జ్ మినిస్టర్ సబితా కి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది నారాయణ రెడ్డి కి సీఎం రమేష్ కి అలాగే వాసు అన్నకి మాధవి అక్క కి ఆది నారాయణ రెడ్డి కి భూపేష్ కి కృష్ణ చైతన్యకి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## పులివెందులలో నిజమైన ప్రజాతీర్పు

### మా రెడ్డి లత గెలుపు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

### హజ్ కమిటీ మెంబర్ మహబూబ్ బాషా




**పులివెందుల మేజర్‌న్యూస్ :** గురువారం వెలువడిన జెడ్పిటిసి ఎన్నికలలో పులివెందుల టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి సతీమణి అత్యధిక మెజారిటీతో పులివెందుల ప్రజలు నిజమైన ప్రజాతీర్పు ఇవ్వడం జరిగిందని హజ్ కమిటీ మెంబర్ మహబూబ్ బాషా గురువారం టిడిపి కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ మా రెడ్డి లతా రెడ్డి విజయానికి కృషి చేసిన ఎన్డీఏ కూటమి నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రమంతా పులివెందుల వైపు తెలుగుదేశం విజయం చూస్తుం దన్నారు. పులివెందుల జడ్పిటిసి ఎన్నికలలో ప్రజలంతా ఒకవైపు ఉండి మా రెడ్డి లతా రెడ్డినిఅత్యధిక మెజారిటీతో గెలిపించడం జరిగిందన్నారు. ఈ విజయ శుభ పరిణామం వెలకట్టలేనిది సంతోషం కలుగుతుందని ఆయన అన్నారు., నిన్నటి దినం జగన్మోహన్ రెడ్డి మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఆయన అన్నారు. పులివెందుల నియోజకవర్గం గ్రామ ప్రజలు బిటెక్ రవి ఆధ్వర్యంలో ప్రజలకు మంచి జరుగుతుందని ఆశించి ఇంతటి ఘన మెజారిటీని అందించడం జరిగిందని ఆయన అన్నారు. పులివెందుల మున్సిపాలిటీ అయినప్పుడు నుండి తెలుగుదేశం పార్టీ నాయకులకు ఒక్క నామినేషన్ కూడా వేయనీయలేదు అన్నారు. ఆ విషయం జగన్ మోహన్ రెడ్డికి కూడా తెలుసని ఆయన అన్నారు. మున్సిపాలిటీ ఎన్నికలకు టిడిపి నాయకులు నామినేషన్ వేసేందుకు వెళ్తూ ఉంటే పోలీసులతో నామినేషన్ పత్రాలను చించించినది మీకు గుర్తు రాలేదన్నారు. ఇక జరగబోయే మున్సిపల్ఎన్నికల్లో 33 వార్డులు టిడిపి కైవసం చేసుకోవడం ఖాయమన్నారు.

## 17న కడపలో విదేశీ విద్యపై అవగాహన కార్యక్రమం



**కడప ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** నిహార్ ఓవర్సీస్ ఆధ్వర్యంలో, వోక్స్ ఓవర్సీస్ సౌజన్యంతో, కడప జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ లో ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు విదేశీ విద్యపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరగనుంది నిహార్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ రీజినల్ కోఆర్డినేటర్ నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు, “రష్యా, జార్జియా, ఫిలిప్పైన్స్, ఇటలీ, కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, ఆర్మేనియా, యుకె, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో ఎంబిబిఎస్, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్, హెూటల్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ తదితర కోర్సులపై నిపుణులు పూర్తి వివరాలు అందిస్తారు.తక్కువ ఖర్చుతో, అధిక నాణ్యత విద్యను అందించే విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందే విధానం, స్కాలర్‌షిప్ అవకాశాలు, వీసా ప్రాసెస్, కోర్సు ఎంపిక వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించబడుతుంది.విదేశీ చదువుపై ఆసక్తి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి తప్పకుండా హాజరై, తమ భవిష్యత్ విద్యా ప్రణాళికలను సుస్పష్టంగా రూపొందించుకోవాలి” అని తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. ముందస్తు నమోదు కోసం 7702172568 నంబర్‌కి కాల్ చేయాలని కోరారు.

## దేశం నేతల విజయోత్సవ సంబరాలు



**కడప రూరల్ మేజర్‌న్యూస్ :** పులివెందుల జెడ్పిటిసి ఉప ఎన్నికల్లో మా రెడ్డి లతా రెడ్డి గెలుపొందడంతో టిడిపి నేతలు జిల్లా ఇన్చార్జి మంత్రి సవితమ్మ, రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు, కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, జమ్మల మడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి హెూటల్ హరిప్రియలో గురువారం కేక్ కట్ చేసి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం నూతన తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యా లయం ఆవరణలో టిడిపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జడ్పిటిసి లతా రెడ్డికి అభినందనల వెల్లువ

### కృతజ్ఞతలు తెలుపుతున్న మహిళలు



**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల మండలం జడ్పిటిసి ఉప ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన టిడిపి పార్టీ అభ్యర్థి లతా రెడ్డికి గురువారం పులివెందులలోని టిడిపి కార్యాలయం నందు ఘన స్వాగతం పలుకుతూ వైసిపికి కంచు కోట లాంటి పులివెందుల మండ లంలో విజయం సాధించినందుకు పూల మాలలు వేసి శుభాకాంక్షలు తెలుపుతూ ఇలాంటి పదవులు ఎన్నో అధిరోహించి ప్రజాసేవ కోసం కృషి చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేత రాహుల్‌పై జగన్ విమర్శలు చేయడం తగదు



**కడప ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ పై జగన్ తీవ్ర విమర్శలు చేయడం దీనికి వెంటనే జగన్ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ మైనార్టీ నాయకులు ఖాదర్ ఖాన్ పేర్కొన్నారు నిన్న జరిగిన జెడ్పిటిసి ఎన్నికల్లో వైయస్ఆర్సీపీకి డిపాజిట్లు కూడా దక్కకుండా ఓడిపోయారు అన్నారు కాంగ్రెస్ అభివృద్ధి కోసం అనేక రాష్ట్రాలు తిరుగుతూ పాదయాత్రలు సైతం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న రాహుల్ గాంధీ ని అవహేళనగా మాట్లాడడం జగన్ కి తగదన్నారు ఇలాంటి దుష్ప్రచారాలు అవహేళన మాటలు మాట్లాడటం వలన జగన్ పార్టీకి జనం దూరం అవుతున్నారన్నారు కాంగ్రెస్ సీనియర్ నాయకులను మాట్లాడే ముందు వారి స్థాయి తెలుసుకుని మాట్లాడాలన్నారు జగన్ చివరికి కాంగ్రెస్ పార్టీని దిక్కు అన్నారు.

## రక్తదానం ఒక సామాజిక బాధ్యత మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్

### రక్తదానం మనిషికి దేవుడు ఇచ్చిన గొప్పవరం భాష్యం ప్రిన్సిపల్ ఉమాదేవి



**పులివెందుల మేజర్‌న్యూస్ :** రక్తదానం ఒక సామాజిక బాధ్యత అని మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ పేర్కొన్నారు. పులివెందుల పట్టణం లోని భాష్యం పాఠశాలలో చైర్మన్ భాష్యం రామక్రిష్ణ, వైస్ చైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ రామ్ వారి ఆదేశాల మేరకు గురువారం ముందస్తు 79 వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు నిర్వహించడం. ఈ వేడుకలలో భాగంగా భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ ఉమాదేవి సమక్షంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, ప్రిన్సిపల్ ఉమాదేవి, రక్తనిధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవ్ లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ శిబిరం లో పాఠశాల పేరెంట్స్ దాదాపు 40 మంది రక్తదానం చేశారు.ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ రక్తదాన కార్యక్రమం ప్రతిఒక్కరు ఒక సామాజిక బాధ్యత గా భావించి రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఉమాదేవి మాట్లాడుతూ రక్తదానం చేయడం అంటే ప్రాణాపాయ స్థితి లో ఉన్నవారికి ప్రాణదానం చేసే ఈ అవకాశం దేవుడు మనిషికి ఇచ్చిన గొప్ప వరం అని కావున ప్రతి ఒక్కరు రక్తదానం తో ప్రాణదాతలు అయ్యేందుకు సిద్ధం గా ఉండాలన్నారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవ్ మాట్లాడుతూ 18 సంవత్సరాల పూర్తి చేసుకున్న వయసు వారి నుండి 60 సంవత్సరాలు వయసు వరకు ఆరోగ్యం గా ఉన్న ఎవరైనా ప్రతి 3 నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు అన్నారు. అనంతరం రక్తదానం చేసిన పేరెంట్స్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో యస్ ఆర్గనైజషన్ ఫౌండర్ వీర నారాయణ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, రక్తనిధి సిబ్బంది, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ



కలసపాడు, మేజర్‌న్యూస్ : కలసపాడు మండలం ముదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పామూరి రమణారెడ్డి సరస్వతి కుమారుడు మనోహర్ రెడ్డి మౌనికల వివాహానికి బద్వేల్ మాజీ శాసన సభ్యురాలు కే విజయమ్మ పాల్గొని అక్షింతలు వేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎగువ సగరు నీటి సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి చిన్న రంగారెడ్డి లింగారెడ్డి పల్లె తెదేపా నాయకులు స్వామి రంగారెడ్డి ముదిరెడ్డిపల్లి తెదేపా నాయకులు రామాంజనేయులు రెడ్డి రామ సుబ్బారెడ్డి గురివిరెడ్డి సుధాకర్ రెడ్డినాగలకుంట్ల మాజీ సర్పంచ్ సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సేవాపతకానికి సి.సి.ఎస్ ఎస్.ఐ ప్రకాష్ రావు ఎంపిక



**కడప క్రైమ్, మేజర్‌న్యూస్ :** శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ అధికారులు, సిబ్బంది చేస్తున్న సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక విశిష్ట సేవా పథకాన్ని కడప సి.సి.ఎస్ ఎస్.ఐ బి.ప్రకాష్ రావు ను ఎంపిక చేశారు, ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి అశోక్ కుమార్ ఎస్.ఐ ప్రకాష్ రావు ను ప్రత్యేకంగా అభినందించారు. వివరాల్లోకి వెళితే.. బి.ప్రకాష్ రావు 1984వ సంవత్సరంలో జిల్లా పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో పులివెందుల, మైదుకూరు, మన్నూరు, ప్రొద్దుటూరు, కడప ట్రాఫిక్, కడప వన్ టౌన్ తదితర పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తించి ఉన్నతాధికారుల ప్రశంశలు పొందారు. అంకిత భావం తో విధులు నిర్వర్తించినందుకు తన సర్వీస్ లో మొత్తం 45 నగదు రివార్డులు, 38 జి.ఎస్.ఈలను ఉన్నతాధికారుల నుండి అందుకున్నారు.

## రాష్ట్రస్థాయిలో కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినుల ప్రతిభ




**కడప ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మేరకు ఈ నెల 11వ తేదీన ఎస్ ఆర్ ఆర్ మరియు సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విజయవాడ నందు సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ), 2005, 20వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో జరిగిన డిబేట్ (వాదన) పోటీలలో కళాశాలకు చెందిన విద్యార్థినిలు షేక్ జేబా మరియు షేక్ అఖిఫా బాటిల్ ద్వితీయ స్థానంలో నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి సలీం భాష తెలిపారు. వీరిని కళాశాల ఆవరణములో ఘనంగా సత్కరించడం జరిగినది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గారు మాట్లాడుతూ వీరు కళాశాల స్థాయిలోనూ, ఎన్ ఆర్ సి స్థాయిలోనూ మరియు జోనల్ స్థాయిలలో మొదటి స్థానంలో నిలిచారని తెలిపారు. వీరు భవిష్యత్తులో ఇలాంటివి ఎన్నో పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచాలని తెలిపారు. వీరిని కళాశాల అధ్యాపక ఆధ్యాపకేతర మరియు విద్యార్థినిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్టీసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎల్ రాజమోహన్ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ఎం వి రమణయ్య, డాక్టర్ ప్రకాష్ నారాయణ రెడ్డి, డాక్టరు సచి దేవి, డాక్టర్ ఆశాలత, అనురాధ పాల్గొన్నారు.

# సిపిఐ రాష్ట్ర మహాసభలకు జయప్రదం చేయాలని గోడపత్రాల ఆవిష్కరణ

### సిపిఐ 28వ రాష్ట్ర మహాసభలకు ఛలో ఒంగోల్



పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ : ఒంగోలు పట్టణంలో ఈనెల 23 తేదీన సిపిఐ 28వ రాష్ట్ర మహాసభల సందర్భంగా భారీ బహిరంగ సభ ర్యాలీ నిర్వహిస్తున్నామని సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, సిపిఐ మండల కార్యదర్శి రవికుమార్‌లు గోడపత్రాలు ఆవిష్కరించి, ప్రజలు కార్మికులు కర్షకులు పార్టీ సభ్యులు పాల్గొని బహిరంగ సభకు సిద్ధం కావాలని వారు అన్నారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 28వ రాష్ట్ర మహాసభలు ఈనెల 20 నుండి 25 వరకు ఒంగోలు నగరంలో జరుగుతున్నాయి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాల పైన పూరించే విధంగా ఈ మహాసభల్లో చర్చలు జరిపి రాష్ట్ర సమగ్ర అభివృద్ధిదేంగా ప్రాజెక్టు పూర్తి కావడమే రాష్ట్ర అజెండాగా, నిరుద్యోగ లు ఉపాధి కావాలన్నా, పేదవాడికి ఇంటిజాగా ఇవ్వాలన్నా, రైతన్నలకు ఎరువులు పురుగుల మందులు రేట్లు నియంత్రించాలన్న, ఈ రాష్ట్ర మహాసభలే వేదిక కాబోతున్నాయి ఈ మహాసభలకు ప్రజలందరూ ఐక్యమై కార్మికులు కర్షకులు పేదలు, బడుగు బలహీన వర్గాలు అధిక సంఖ్యలో పాల్గొనాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా పిలుపునివ్వడం జరిగింది. ఈ బహిరంగ సభకు జాతీయ కార్యదర్శి డి రాజా, కే.నారాయణ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ సహాయ కార్యదర్శిలు ముప్పాల నాగేశ్వరరావు, జె వి సత్యనారాయణ దేశ విదేశాల నుండి ప్రతినిధులు వస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు చెన్నయ్య,, ఏఐటీయూసీ మండల కార్యదర్శి సఫా, అధ్యక్షులు పేరయ్య, ఆటో నాయకులు చంద్ర, ఓబులేసు, శ్రీను, చాంద్ భాషా, వెంకట సుబ్బయ్య, అదేవిధంగా సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో తైక్వాండో పోటీలో ప్రతిభ చాటిన పోరుమామిళ్ల వారియర్స్ అకాడమీ క్రీడాకారులు



పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ : జాతీయ స్థాయి ఓపెన్ తైక్వాండో ఛాంపియన్షిప్ లో పతకాలు సాధించారు. తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (టి ఎఫ్ ఐ) ఆధ్వర్యంలో 10 వ జాతీయస్థాయి ఓపెన్ తైక్వాండో పోటీలు ఈనెల 25 నుంచి 27 వరకు విజయవాడలో చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియం నిర్వహించారు. ఈ పోటీల్లో వారియర్స్ తైక్వాండో అకాడమీ క్రీడాకారులు 1ఫర్ మాన్2. నాగ దీపిక 3. హరిచరణ్ 4. గురు జస్వంత్ 5. ఆయిల్ 6. జతిన్ రెడ్డి లు బంగారు పతకాలు సాధించారు.1. వైష్ణవి 2. షరీఫ్ రజత పతకాలు సాధించారు. వీరిని వారియర్స్ అకాడమి కోచ్ సుభాష్ రఫీ లు అభినందించారు.

## భూ వివాదం కేసులో నలుగురికి రెండు సంవత్సరాలు జైలుశిక్ష, 500/- జరిమానా

### శిక్ష విధించిన బద్వేల్ సీనియర్ జడ్జి పద్మశ్రీ

**పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ :** కడప జిల్లా పోరుమామిళ్ల మండలం చిన్న కప్పలపల్లి గ్రామానికి చెందిన అంకాల బంగారు పోలయ్య మరియు వారి తల్లిదండ్రులపై భూ వివాదం కారణంగా అదే గ్రామానికి చెందిన వారి బంధువులు మరియు నిందితులు అయిన 1. అంకాల పోలయ్య అలియాస్ (మండెల్లపోలయ్య),2. అంకాల పెద్ద గురప్పుడు అలియాస్ (కాగోడు), 3. అంకాల గురప్పుడు,4. అంకాల రామరాజు. 2018 సంవత్సరంలో వీరు నలుగురు కలసి అంకాల బంగారు పోలయ్యను మరియు వారి తల్లిదండ్రులను చంపాలనే ఉద్దేశంతో దాడి చేసి రక్తగాయాలు కలిగించారు. ఈ సంఘటనపై పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడింది.ఆ కేసును విచారించిన కోర్టు గురువారం (14వ తేదీ) నిందితులు నేరం చేసినట్లు రుజువు అయినట్లు తేల్చి బద్వేల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి పద్మశ్రీ నిందితులందరికీ రెండు సంవత్సరాల జైలు శిక్ష మరియు ?500/- జరిమానా విధించారు. జరిమానా చెల్లించనిపక్షంలో, అదనంగా ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పు వెలువరించారు.ఈ కేసులో సమర్థవంతంగా వాదించిన ప్రభుత్వ ఏ డి డి ఎల్. పి పి బొక్కసం శ్రీనివాసులు, అలాగే సరైన సాక్ష్యాలను సమర్పించి నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోరుమామిళ్ల సీఐ డి. శ్రీనివాసులు, ఎస్ఐ ఆర్.వి. కొండరెడ్డి, మరియు కోర్టు హెడ్ కానిస్టేబుల్ కె. శ్రీనివాసులరెడ్డి లకు ఉన్నత అధికారులు అభినందనలు తెలిపారు.

# ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత సీట్ల భర్తీ

### ఈనెల 20వరకు దరఖాస్తులు

**రాజుపాళెం,మేజర్‌న్యూస్ :** ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత సీట్ల భర్తీకి ఈనెల 20 తేది వరకు ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకోవచ్చని మండల విద్యాశాఖ అధికారులు ప్రసాద్, రామస్వామి రెడ్డిలు తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలో ఒకటవ తరగతి ప్రవేశానికి 25 శాతం ఉచిత విద్యను అమలు చేస్తుందన్నారు గ్రామాలకు 5 కిమీలల్లో ఉన్న పాఠశాలలో మిగిలి ఉన్న సీట్లకు రాష్ట్ర ప్రభుత్వ వెబ్ సైట్ లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు ఆర్థికంగా వెనుకబడి ఉన్న ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనార్టీ,ఓబిసి,ఓసి వర్గాలకు చెందిన కుటుంబాల పిల్లలు అర్హులన్నారు ఉచిత విద్య కోసం పిల్లలకు ఐదు సంవత్సరాలు నిండి ఉండాలన్నారు దరఖాస్తుకు జనన,కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార కార్డు రెండు పాస్ పోర్టు సైజు ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు ఈ అవకాశాన్ని అర్హులైన పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.